# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి భోధామృతము



రచయిత :

**Late శ్రీ కందర్ప సూర్యనారాయణ**

ప్రకాశకులు :

ఘుడియారం భాస్కర మూర్తి

Scanned with CamScanner

# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి బోధామృతము

రచయిత :

**Late శ్రీ కందర్ప సూర్యనారాయణ**

ప్రకాశకులు :

**ఘడియారం భాస్కర మూర్తి**

Scanned with CamScanner

| | | |
|---|---|---|
| ప్రథమ ముద్రణ | : | సంవత్సరం 2000 |
| కాపీలు | : | 1008 |
| వెల | : | రు. 15/- |
| | | |
|---|---|---|
| సర్వహక్కులు | : | శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి<br>రాజయోగాశ్రమ సేవా సంఘము<br>మహేంద్రవాడ. |
| | | |
|---|---|---|
| రచన | : | Late శ్రీ కందర్ప సూర్యనారాయణ<br>హోమియో వైద్యులు<br>మండపేట, తూర్పు గోదావరి జిల్లా |
| | | |
|---|---|---|
| డి.టి.పి. | : | చంద్రాస్స్ గ్రాఫిక్స్,<br>కాచీగూడ, హైద్రాబాదు-27. |
| ముద్రణ | : | మహేశ్వరి ప్రింటర్స్<br>కాచీగూడ, హైద్రాబాదు - 27. |

Scanned with CamScanner



శ్రీ సనారివిశ్వేశ్వర సాక్షాత్కారము.

Scanned with CamScanner

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి జగద్గురు శ్రీశ్రీశ్రీ సనారీ విశ్వేశ్వరుల
శ్రీశ్రీశ్రీ అయ్యల సోమయాజి గురువర్యుల అనుగ్రహలబ్ధమైన
బ్రహ్మానుభూతిని వివరించిన గుర్వష్టకము

# గుర్వష్టకము

సీ॥ శ్రీపతిశివధాత చిద్రూపయుక్తుడౌ పరమాత్మరూపునే బ్రస్తుతించి సకలచరాచర జంతుజాలములందు వివరించుచున్న సద్విమలు దలచి ధరయాదిగా భూతతత్వాత్ముడైనట్టి హంస.స్వరూపునే నభినుతించి నిర్గుణజ్ఞప్తితో నెగడు లోకములెల్ల పరిపాలనమొనర్చు ప్రభుని నెంచి శిష్యుకానన సీసపద్యాష్టకంబు। సెప్పినుతిసేతు కృపజూడు సేవకుడను విశ్వనాథావధూత సద్విమలచరిత। పతితపావన సద్భక్తపారిజాత॥1॥

బాలప్రాయమునాడు పరమాత్మ గనులందు జూపించిబ్రోచినసూరివీవె। నాల్గుయోగంబులు నమ్మికగాదెల్పి కేవలాత్మను జూపితీవె గావె । లక్ష్యత్రయంబులు లక్షణంబుగ దెల్పి తస్సాక్షిదెలిపిన దాతవీవె । ఆహాహ మిమ్ముల నుతి యింప నజునికైన । తరముగాదయ్య । నిర్గుణతత్వమూర్తి । విశ్వనాథావధూత సద్విమలచరిత । పతితపావన సద్భక్తపారిజాత ॥2॥

ప్రకృతిద్వయాటవిభంగమెట్లనివేడ షోడశీదువహ్ని జూపినావు । తత్వరూపమునాకు దయదెల్పు మనివేడ తెలివిబ్రహ్మంబనుచు దెల్పినావు। తెలివెట్లుబ్రైక్యమో దెల్పవేయని వేడబట్టబయలందంచుబల్కినావు । ఆబట్టబయలెద్దియని మరియును వేడబ్రహ్మంబదేమంచు బల్కినావు । బల్కు కళలేనిదీ వస్తువనుచు నాకు జెప్పి వప్పించినట్టి మాయప్ప వీవె ॥వి॥ ॥3॥

ముద్రపంచకమును ముక్తపరిచియు యోగనిద్ర దెల్పిన కృపానిధిని నీవె । యీరేడు లోకంబు లీమేనజూపి సుజ్ఞానంబు గలిగించు ఘనుడవీవె । హఠమును యోగమభ్యాసంబుజేయించి దుర్వృత్తులను ద్రుంచు



Scanned with CamScanner

ద్రుక్కులీవే । పిమ్మట దానిపై ప్రీతియుబోకార్చి పెనుబయల్రా క్రించు ప్రభుడవీవె। ప్రాకప్రాకంగ జగములు రాకపోక దెల్పియెరుగంగ నేర్పిన దైవమీవె ॥వి॥ ॥4॥ సప్త భూమికలలో సారాంశమరయగా షోడశాక్షరిలోన సూటియయ్యె । సప్తచక్రములలో సారాంశమరయగా షోడశాక్షరిలోన సూటియయ్యె । సర్వసమాధుల సారాంశమరయగా షోడశాక్షరిలోన సూటియయ్యె । సచ్చిత్సుగాభాస సాక్షినైనను జూడషోడశాక్షరిలోన సూటియయ్యె । పంచదశివలె షోడశనెంచ శేష సొజ్ఞనొందిలి ద్వాదశాక్షరుడ వగుచు ॥వి॥ 5 ఉన్న దెప్పుడునిండి యుండియేయున్నది లేనిదెప్పొనైనలేనెలేదు । యిది నిజంబేకాని యీ రెండుననబోక మరియెన్నిచో ననుమానపడక । నూరకుండుటెవాలు నూహింపనిపుడు వచ్చినదెల్ల భ్రమరూపు సిద్ధమరయు । నాభ్రమరూపమె యచలరూపమెకాని యన్యంబుగా నేరదచలమునకు నబ్ధినుదయించు బుదబుదంబదియుజూడ । నబ్ధిరూపంబునగుగాక నన్యమగునె ॥వి॥ ॥6॥ ఈయుత్తబట్టబయలేమి లేదంచు తానూహించి తెలియువాడుత్త ముండు । ఆ తెల్వి ననుభవం బాత్మలో పరికించి యది మంత్రమందున నైక్యపరచి । యదియును గురువు నందైక్యంబుగా జేసి యాయైక్య భావమే నాత్మనరసి । చూడచూడగరిత్త శూన్యభావము జెంద బట్టబయలై నిల్చుగుట్టుతోడ । నట్టిగుట్టెట్టి దంచాత్మ బట్టనేని పుట్టుటయు గిట్టుటయు రెండు వట్టివగును ॥వి॥ ॥7॥ వాసిమీరగ రెడ్డి వంశాబ్ధి సోముండుబ్రహ్మయార్యుం డొప్పుబ్రహ్మభావు । డమ్మహామహునికే నాత్మసంభవుడై సుబ్బరాయుడనంగ విశ్రుతివహించి । భవదియ్యకృపచేత బడసిన యిమ్మేటి సర్వోపనిషదర్థ సారమెల్ల । నానేర్చుకొలది విన్నపము జేసినవాడ యీయర్థ మాత్మ మూహించువారు । భ్రాంతి రూపాది రహితసద్బ్రహ్మభావమంది యానంద వార్ధినోలాడకుంద్రె । క్షితివినయ్యల సోమయాజికులవర్య । భక్త హృదయాబ్జ సూర్య శ్రీ పాపయార్యా ॥8॥

|||



శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి గురు దంపతులు

Scanned with CamScanner

## శ్రీ సద్గురుస్తుతి :

శ్లో॥ పాపయార్య । నమస్తుభ్యం । పాపారణ్య దవానల ।
విశ్వనాథ । నమస్తుభ్యం । విశ్వరూపాయ తే నమః.

శ్లో॥ లోచనాంతరవాసాయ । లోకజ్ఞప్తికళాత్మక ।
జ్ఞప్తి సాక్షి స్వరూపాయ । నేత్రవాసాయ తే నమః.

శ్లో॥ దృగంతర నివాసాయ । దృశ్యప్రతిఫలాత్మక ।
దృగ్దృశ్యాతీతరూపాయ । నేత్రవాసాయ తే నమః.

శ్లో॥ సూక్ష్మ మార్గనివాసాయ । శుద్ధ బ్రహ్మాస్వరూపక ।
సుప్రకాశ స్వరూపాయ । నేత్రవాసాయ తే నమః.

శ్లో॥ మంగళందృగ్రూపాయ । మంగళం దృశ్యరూపక ।
దృగ్దృశ్యాతీత రూపాయ । శుద్ధరూపాయ తే నమః.



Scanned with CamScanner

శ్రీగురుభ్యోనమః

శ్రీ సీతారామచంద్ర సద్గురు వాసుదేవ పరబ్రహ్మణే నమః

# విజ్ఞప్తి

శ్రీసుబ్రహ్మణ్య మహర్షి బోధామృతము అను ఈ గ్రంధము గురు శిష్య పరంపరాగతముగ విలసిల్లిన దివ్య పుష్పము. గృహస్థాశ్రమమున నుండి తరించుటకు ప్రబోధించుట, తరుణోపాయములను త్రికరణ శుద్ధిగ స్వీకరించి ఆచరించుటవలన కలుగు మానసిక వికాసము ఇందలి సారాంశము. ఈ భారతావని ఆధ్యాత్మిక విద్యకు పుట్టినిల్లు. ఏవత్ ప్రపంచమునకు శాంతి చేకూర్చు మూల నిలయము. శ్రీకృష్ణపరమాత్మ నుడివినటుల అన్ని విద్యలలోను నేను బ్రహ్మ విద్యనను స్మృతి తప్పక కలుగజేయును. ఈ అవనియందు ఎందరో మహర్షులుద్భవించిరి. అట్టి మహనీయులలో శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షి యొకరు. వీరు వారి గురువుల కృప వలన శ్రీ సీతారాములనుపాసించుచు సాక్షాత్కారసిద్ధినొందిరి. ప్రహ్లాదుని భక్తి, వసిష్ఠుల కర్మనిరతి, శ్రీశుకుల జ్ఞాన ఫలము వీరి దర్శన భాగ్యమున కలిగియుండుట వీరి ప్రత్యక్ష శిష్యుల వచనము అనుభూతి. అట్టి దివ్యాను భూతికి నిదర్శనముగ వెలసిన ఈ గ్రంథమును అందజేయవలెనన్న తత్పరతనా సేవా భాగ్యముగ తలంచి అస్మద్గురువర్యులైన శ్రీ కందర్ప సూర్యనారాయణ గారి ఆశీస్సులతో వారి అనుజ్ఞ తీసికొని ఈ సద్గ్రంథమును సహృదయుల ముందుంచినాను.

ఇందు శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షులకు మంత్ర దీక్షనొసంగిన శ్రీ అయ్యాల సోమయాజుల పాపయ శాస్త్రిగారిని గురించి స్తుతించిన సద్గురు స్తుతిని పొందు



Scanned with CamScanner

పరచినాము. మరియు శ్రీశ్రీశ్రీ జగద్గురు విశ్వనాథావధూత స్వామి ఛాయాచిత్రము వారి దివ్య సందర్శనము (శ్రీసనారీ విశ్వేశ్వరసాక్షాత్కారము) యోగ గురువులుగ శ్రీ సుబ్రహ్మణ్య మహర్షుల వారికి గావించిన బోధను అనుభూతిని దివ్యానుగ్రహ రూపమున శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షుల వారి ముఖతా వచ్చిన శ్రీ గుర్వష్టకము ఇందు పొందు పరిచినాము.

శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షి దంపతుల ఛాయాచిత్రము శ్రీశ్రీశ్రీ కందర్ప సూర్యనారాయణ గురు దంపతుల యొక్క ఛాయా చిత్రములు ఇందు పొందుపరచుట జరిగినది.

శ్రీశ్రీశ్రీ స్వేచ్ఛానందనాథ దీక్షానామాంకితులైన శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షులు జగద్గురు శ్రీశ్రీశ్రీ సనారీ విశ్వేశ్వరుల అనుగ్రహముచే మంత్ర, హఠ, లయ, రాజయోగములందు సిద్ధి నొంది గృహస్థాశ్రమమునేయుండి గృహస్థకల్పతరువై అర్హులగు వారికి బ్రహ్మ విద్య, యోగసాధనలు, అనుగ్రహించి శ్రీశ్రీశ్రీ జగద్గురు విశ్వనాథావధూత స్వామి వారి ఆదేశానుసారము గురుపరంపరగా బ్రహ్మవిద్యాజ్ఞానమును ప్రసరింపజేసినారు.

శ్లో॥ గురుర్బ్రహ్మ గురుర్విష్ణు ర్గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్పరం బ్రహ్మ తస్మై శ్రీగురవేనమః

శ్లో॥ గుకారశ్చాంధ కారోహి, రుకారస్తేజ ఉచ్యతే
అజ్ఞానగ్రాసకం బ్రహ్మ, గురురేవన సంశయః

శ్లో. గుకారశ్చాంధకారస్తు, రుకారస్తన్నిరోధ కృత్
అంధకార వినాశిత్వా, ద్గురురిత్యభిధీయతే

శ్లో. గుకారశ్చ గుణాతీతో రూపాతీతోరుకారకః
గుణరూప విహీనత్వా ద్గురురిత్యభిధీయతే

శ్లో. గురుమధ్యేస్థితం విశ్వం విశ్వమధ్యే స్థితో గురుః
గురుర్విశ్వం సమస్తంతుతస్మై శ్రీ గురవేనమః

చరాచర ప్రపంచమంతయును గురు శక్తితో నిండియున్నది. పరిపూర్ణ పరబ్రహ్మతత్వమే గురువు.

శ్లో. నగురోరధికం తత్వం, నగురోరధికం తపః
తత్వజ్ఞానాత్పరంనాస్తి, తస్మైశ్రీగురవే నమః

శ్లో. ధ్యాన మూలం గురోర్మూర్తిః, పూజామూలం గురోః పరం
మంత్రమూలం గురోర్వాక్యం, ముక్తి మూలం గురోః కృపా

అట్టి పరతత్త్వమని చెప్పబడిన గురుశక్తియే మానవ రూపముదాల్చి పవిత్ర హృదయులగు వారికి బ్రహ్మబోధలొనర్చుచుండును. ఇట్టి గురుశిష్య సంఘటన అసాధారణమైయుండును. (This auspicious event is an unique combination and this can be termed as hatching an egg into life, i.e., Dwijanma OR can be termed as an act of incubation i.e., transforming the devotee from Asatoma To Sadgamaya Tamasoma To Jyotirgamaya; mrutyorma To Amrutangamaya).



Scanned with CamScanner

వెదుక వెదుక దొరుకు వేదాంత వేద్యుండు
వెదకు వారిని తానె వెదకుచుండు.

శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షుల కరుణా కటాక్షమునకు పాత్రులై పరిపూర్ణముగ బోధనంది చరాచర ప్రపంచమునంతను శ్రీ రామ తారక పరబ్రహ్మ మయముగ గాంచుచు శుద్ధాత్మారామ బ్రహ్మానందానుభూతితో సకల కార్యకలాప దక్షులైన అస్మద్గురువర్యులైన శ్రీ సూర్యనారాయణ గారి కృపాకటాక్ష వీక్షణము నాపై సోకుటచే ఇట్టి గురు పరంపరను సంస్మరించుచు త్రికరణశుద్ధిగ ఈ గురుశిష్య సమావేశ సంభాషణము బ్రహ్మజ్ఞానార్థులకు, ముముక్షువులకు స్థిరమైన విశ్వాసము వికాసము కలుగజేయునను ఆ కాంక్షతో అట్టి బ్రహ్మజిజ్ఞాసువులకు అంకితము చేయుచున్నాము.

The very purpose and goal of life is to know and realise the truth of self i.e., Soul which is Eternal-Wisdom and Bliss. This can definitely be achieved by following the foot steps of Sat Guru in every religion and all the religions will finally lead and merge in this ocean of Eternal Bliss and Wisdom.

శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షుల వారు అనేక అవధూతలను, మహర్షులను, యోగీశ్వరులను కలసి సర్వమత సారాంశమైన భగవద్భక్తి, జ్ఞాన వైరాగ్యములతో బ్రహ్మ నిష్ఠలో నిమగ్నులై సద్గురు గీతలకు సుజ్ఞాన దీపమై వెలసిల్లినారు.

శ్లో॥ సర్వశ్రుతి శిరోరత్న, నీరాజిత పదాంబుజం
వేదాన్తార్థ ప్రవక్తారం, తస్మాత్సం పూజయేద్గురుం



Scanned with CamScanner

శ్లో॥ యస్యస్మరణ మాత్రేణ, జ్ఞానముత్పద్యతే స్వయం
సేఏవ సర్వసంపత్తి, స్తస్మాత్సం పూజయేద్గురుం

ఇట్టి సద్గురు మూర్తిని ధ్యానించుచు శ్రీ గురుగీతలు పఠించుచున్న జిజ్ఞాసువులకు మోక్షము కరతాలామలకము.

The touch and benign glance of SATGURU will transform the genuine devotee and disciple of true discipline into Divine Life and HIS LOTUS FEET act like a touch stone to make such a disciple to have Divine Vision. It is just like an iron particle becomes Gold when it comes into contact with PARASUVEDI. Even these examples may not stand to the test of experience which is beyond word and thought !

What is required is the constant practice until the last breath with unflinching devotion and self introspection.

శ్లో. అనన్యాశ్చింత యంతోమాం యేజనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగ క్షేమం వహామ్యహం

శ్లో. అనన్యచేతాస్సతతం యోమాం స్మరతి నిత్యశః
తస్యాహంసులభం పార్థ, నిత్యయుక్తస్య యోగినః

దీనినే గురుభక్తి, భగవద్భక్తియని తెలిసికొని సదాచార సంపత్తితో జీవనము చేయుట పరమ కర్తవ్యము. అట్టి మహనీయులు సమాజమునకు మార్గదర్శకులై దేశాభ్యున్నతికి ప్రపంచ శాంతికి మూలపురుషులైవెలుగొందగలరు. అట్టిమహనీయులు, ధీరోదాత్తులైన అస్మద్గురువర్యులు శ్రీ కందర్ప సూర్యనారాయణగారు తను



Scanned with CamScanner

దివ్యజీవనములో శ్రీరామ, శ్రీకృష్ణాద్యవతార మూర్తుల వైభవమును రంగ రించుకొని శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షుల కరుణా కటాక్షముతోను వారి ఆజ్ఞతోను నిగూఢముగ శ్రీగురు పరంపరా వైశిష్ట్యమును నియమ నిష్ఠలతో గృహస్థాశ్రమమును ఠీవిగపరిపోషించి ఆదర్శమును నెలకొల్పినారు.

వారు రచించిన ఈ సుబ్రహ్మణ్య మహర్షి బోధామృతము బ్రహ్మజిజ్ఞాసువులకు మార్గదర్శకమై బ్రహ్మజ్ఞానమును ప్రసాదించును.

సర్వేజనాః శుఖినో భవంతు : ఓం తత్ సత్

హైదరాబాదు,
తేది : 19-2-2000

బుధజన విధేయుడు
ఘడియారం భాస్కర మూర్తి



Scanned with CamScanner

# శ్రీ సుబ్రహ్మణ్యమహర్షిబోధామృతము

సద్గుర్గుభ్యోనమః

కృష్ణంవందే జగద్గురుమ్

రామాయగురవేనమః

## శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి పవిత్ర సంగ్రహ జీవిత చరిత్ర :

శ్రీమంతంబైన భారతవర్షము ఆధ్యాత్మిక విద్యకు సదానిలయము. మహాజ్ఞానులు యోగిపుంగవులు భక్తాగ్రగణ్యులు సృష్ట్యాది నేటి వరకు అవిచ్ఛిన్నముగా అవతరించుచునేయున్నారు అట్లెప్పుడునూ అవతరించుచునేయుందురు.

శ్లో యదాయదాహిధర్మశ్య
గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య
తదాత్మానం సృజామ్యహం.

శ్లో పరిత్రాణాయ సాధూనాం
వినాశాయచదుష్కృతాం
ధర్మసంస్థాపనార్థయ
సంభవామి యుగే యుగే

అని భగవానుడు వాగ్దానము చేసియున్నాడు. ఈ జగత్తును సృష్టి జేసిన భగవానుడు



Scanned with CamScanner

దాని ధారణ, పోషణల నిమిత్తం యెపుడెపుడు అవసరమగునో అప్పుడప్పుడెల్ల తానవతరించి యధర్మమును పోనడచి ధర్మమును స్థాపనజేయుచుండును "ధారయేత్ ధర్మ ఇత్యుచ్యతే" అనగా ఈ జగత్తును ధరించి దానిని సక్రమముగా నడిపించునదే ధర్మము. అనగా యేకాలమందైనను ఈ జగత్తు యొక్క అస్తిత్వమునకు ప్రగతికి మూలాధారము ధర్మమే. అట్టి ధర్మలోపము వలననే యీ ప్రపంచము యొక్క నడక కుంటు వడుచుండును. అశాంతి హెచ్చును. మానవాళికి సుఖ శాంతులు లోపించును. తమస్సు పెచ్చు పెరుగును. అందువలన యుద్ధములు సంభవించెడు పరిస్థితులు క్రమముగా జగత్తు యొక్క వినాశనమునకే దారి తీయును. నేడు తయారు కాబడుచున్న అణ్వాస్త్రములు ఈ వైపునకే దారి చూపుచున్నవి.

కాని జగత్తు నసించుటకు వీలులేదు. నాటి నుంచి నేటి వరకు యిట్టి పరిస్థితులేర్పడినపుడు, యీ తమస్సును పటాపంచలు చేసి యీ జగత్తు యొక్క బరువును తగ్గించి దుష్టశక్తులను పోనడచి యావత్ ప్రపంచమునకు సుఖశాంతులు ప్రసాదించు దివ్య జ్యోతి ఆయా పరిస్థితులకు ఆయా కాలమునకు అనుకూలమగు అవతారముల ధరించి నూత్న వికాసమును ప్రసరింపజేసి పరిస్థితులను చక్కదిద్ది మానవాళిని సన్మార్గమున ప్రవేశపెట్టును. భాగవత సిద్ధాంతముననుసరించి భగవానుని యవతారములు అనంతములు. దుష్ట శిక్షణ శిష్టరక్షణ చేయుచూ ఆదర్శ ధార్మిక ప్రవర్తన జరుపుచూ పరిపూర్ణబోధ వెలయించిన పూర్ణావతారములు శ్రీరామకృష్ణాద్యవతారములు. మరియు తమ జ్ఞానోదయములచే ప్రబోధ చంద్రికలను వెదజల్లిన వసిష్ఠ, వామదేవ, యాజ్ఞ, వల్క్య, వ్యాస, శుక, శంకరాచార్యాది జ్ఞానులు, ప్రహ్లాద, నారద, పరాశర, పుండరీక, శ్రీరామనుజ, మాధ్వ, చైతన్య, శ్రీరామకృష్ణాది మహాభాగవతోత్తములును, జనక, అశ్వపతి మొదలగు రాజ ఋషులును, భగవంతుని అవతారములే.



Scanned with CamScanner

శ్లో॥ యద్యద్విభూతి మత్సత్వం
శ్రీమదూర్జితమేవవా
తత్తదేవావగచ్ఛత్వం
మమతేజోంశ సంభవమ్ . భగవద్గీత

తా॥ నా యొక్క దివ్యత్వమునకు చిహ్నమును, మంగళకరమును స్వప్రకాశకమును, నిత్యవినూత్నమై, అభ్యుదయభావాత్మకమైన విశ్వవిభూతియెల్లనూ నాయొక్క దివ్యతేజము నుండియే వ్యక్తమయినదని తెలిసికొనుము.

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి పరమ పవిత్రమయిన శుక్ల యాజుషబ్రాహ్మణ వంశమున శ్రీ.వే.బ్ర.శ్రీరెడ్డి బ్రహ్మన్న శేషాంబా దంపతులకు సత్పుత్రరత్నమై, తూర్పుగోదావరి మండలమున పామర్రు గ్రామమున జన్మించిరి.

చిన్న నాటి నుండియూ సౌశీల్యము, భూతదయ, పాపభీతి ఋజువర్తనము భగవద్భక్తి, పెద్దల యెడల విధేయత మున్నగు సుగుణములు యీ బాలుని యందమరియుండెను. పూవు పుట్టగనే వాసన తెలియునట్లు క్రమముగా యీ బాలయెగియందు భాగవత లక్షణములు ఆవిష్కరింపబడు చుండెను. తండ్రి బ్రహ్మన్న గారు మంచి నిష్ఠాగరిష్ఠులు. శ్రీ రాముడు వారి యిలవేల్పు. తండ్రి గారి పూజ కొరకు పుష్పములు మున్నగు పూజాద్రవ్యములు సేకరించి యిచ్చుట యందు బాలయోగి పరతంత్రులగుచుందురు. తోటి బాలురతో కూడి యాడక యేకాంతమున శ్రీ రామ విగ్రహములు నిలిపి రహస్యముగా పూజలు చేయుచుండెడి వారు. ఇది గాంచి తండ్రి గారు సంతసించి, ఉపనయనానంతరము శ్రీ.వే.బ్ర.శ్రీ అయ్యల సోమయాజుల పాపయ్య శాస్త్రి గారిచే శ్రీరామ తారక మంత్రము ఉపదేశము చేయించిరి. అది మొదలు



Scanned with CamScanner

మహర్షికి బాహ్య పూజ మానసిక పూజగా మారిపోయెను. భక్తి భావన యారూఢమగు చుండెను. శ్రీ రామ దర్శన భాగ్యమబ్బెను. సగుణోపాసనలో సగుణ బ్రహ్మ సాక్షాత్కారమే పరమావధి సర్వసాధనలకు పరమావధి భగవద్దర్శనమే. సర్వమతములకు సారాంశము భగవత్ప్రాప్తియే. సర్వ విద్యలకు పరమావధి బ్రహ్మవిద్య ఇదియే బాల్యమునుండియు మహర్షి ధ్యేయము. తండ్రి గారి దయవలన తగిన గురువు దొరకెను.

అడుగడుగునకు రాముడు తోడు నీడ వలె సంచరింప సాగెను. మానవ జీవితమునకు యింత కంటె మహాభాగ్యమేమున్నది. ఏది లభించిన యిక యితర లాభములతో పనియుండదో, లేక ఏ లాభము లభించిన వెనుకనన్నియు తమంత తామే లభించునో అట్టి భగవద్దర్శన లాభము మహర్షికి లభించెను. ప్రహ్లాదుని వలె లేబ్రాయముననే శ్రీరామ దర్శనమబ్బిన యీ బాల యోగికి క్రమక్రమముగా వైరాగ్యము మెండగుచుండెను. అది జూచి తండ్రి గారు కుమారునకు తగిన కాంతను జూచి వివాహము జేసి గార్హస్థ్యమున ప్రవేశపెట్ట దలచి కుమారునితో వారి భావము వెల్లడించిరి. గాఢమైన భక్తి వైరాగ్యములతో నిండిన మనసు కలిగిన మహర్షికి యిది అశనిపాతము వలె కనబడెను. తన సాధనలకు తీరని అంతరాయము కలుగునను భయమావహించెను. తండ్రి గారితోనన్నీ సంసార బంధములో పడద్రోయరాదని చెప్పివేసిరి. అయితే తండ్రి గారు అందుకు నియ్యకొనక, చతురాశ్రమములలో గృహస్థాశ్రమ ప్రాశస్త్యము నుగ్గడించి, వసిష్ఠాది మహర్షుల మార్గదర్శకత్వమును చూపించి వివాహమునకు ఒప్పించిరి.

ముగ్గుళ్ల వాస్తవ్యులు శ్రీ లింగాల వీరభద్రయ్య గారి కుమార్తె బాపనాంబ గారిని యిచ్చి శ్రీ సుబ్రహ్మణ్య బాల యోగికి వివాహము చేయుటకు నిశ్చయింపబడెను. పెండ్లి వారు పామర్రు నుండి ముగ్గుళ్లకు తరలి వెళ్లిరి. మధ్య మకాము రాజమండ్రిలో కోటిలింగ క్షేత్రమున జేసిరి. పెండ్లి యాడుటకు తరలి వెళ్లుచున్న ఈ బాల యోగి



Scanned with CamScanner

చిత్తము వైరాగ్యాయత్తమై, సంసార కూపమున పడిపోవుచుంటినను భయముతో ఏకాంతమున మిక్కిలి దుఃఖింప సాగెను. అక్కడనే తపశ్చర్యలో నిమగ్నులయిన జగద్గురు విశ్వనాధావధూత స్వామి వారి కది వినిపించి యా నూతన వరుని చేరదీసి ధైర్యము చెప్పి "నాయనా నీవు వివాహము చేసుకొని, పిమ్మట నా వద్దకు రమ్ము నీకు యిహపర సౌఖ్యములు సకలమును సమకూరును" అని అభయమిచ్చిరి. గుర్వాజ్ఞానుసారముగా యధావిధిగా వివాహము బాలయోగికి జరిగినది. శ్రీమతి బాపనమ్మ గారు వశిష్ఠమహర్షికి అరుంధతి వలె బాలయోగికి సహధర్మ చారిణియై అనుసరించి కరుణారస పూరిత హృదయముతో శిష్య సంతతిని కన్న బిడ్డలవలె ఆదరించిన మాతృమూర్తి.

వివాహానంతరము శ్రీ సుబ్రహ్మణ్య బాలయోగి గుర్వాజ్ఞానుసారముగా శ్రీ విశ్వనాధావధూత స్వాముల చరణ సన్నిధిలో మంత్ర, హఠ, లయ, రాజయోగములలో సాధనలు చేసి సిద్ధిబొందిరి. మరియు డెబ్బదియిద్దరు సాధుపుంగవులను సందర్శించి వారి వలన యోగ రహస్యములను కూలంకుషముగా గ్రహించి వారి ఆశీస్సులనుబడసిరి. సిద్ధపురుషులైన జ్ఞానుల వద్ద శిష్యరికము చేయుట అనుకున్నంత సులువైన పని గాదు. అసలు గుర్వనుగ్రహము సంపాదించుటకే సద్గుణ సామగ్రి కావలసినంత యుండవలెను. అనేక జన్మార్జితమయిన సుకర్మ పుణ్యఫల విశేషముచేగాని సద్గురువు లభించడు.

శ్లో॥ దుర్లభంత్రయమేతత్
మనుష్యత్వం ముముక్షుత్వమ్
మహాపురుష సంశ్రయః

అట్టి మహనీయులు లభించిన తరువాత వారికి చతుర్విధశుశ్రూషలు చేసి సద్గురు మూర్తి కృపకు పాత్రులగుదురు. శిష్యుని తరింపజేయుటకై అనేక పరీక్షలు



Scanned with CamScanner

చేయుదురు. అన్ని పరీక్షలలోను ఆగవలయును. అపుడు గాని గురువు మంత్ర ప్రదానము చేయరు. క్షేత్రము శుద్ధమయినగాని విత్తనము నాటిన ప్రయోజనముండదు. శుద్ధమయిన క్షేత్రమున నాటిన విత్తనము శీఘ్రముగా ఫలించును. స్థిరముగా నిలచును. అట్టి సద్గురుమూర్తిని సేవించితిమా అతి దుర్ఘటమయిన బ్రహ్మ విద్య అతి సులువుగా లభించును. అనేక సాధనలతో పనియేయుండదు. ఒక్క క్రీగంటి ప్రసారముచే సద్గురు మూర్తి శిష్యుని హృదయ సీమయందు బ్రహ్మచైతన్య స్ఫురణ కలుగజేయును. ఒక్క మారుహస్తమస్తక సంయోగముచే శక్తిపాతమొనరించును. మహనీయుల వద్ద ఎట్లు మసలవలయునో, ఏ రీతిని శుశ్రూషలు చేయవలయునో తెలుపుట కొరకే శ్రీ విశ్వనాథావధూత స్వామి శ్రీ సుబ్రహ్మణ్య యోగిని సాధుపుంగవుల సందర్శనార్థమై పంపిరి. అందువలననే శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి గురుశిష్య ధర్మమర్మములను కూలంకషముగా సంపాదించెను. శ్రీ సుబ్రహ్మణ్య బాలయోగి శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి అయ్యెను. అలనాటి వసిష్ఠ, యాజ్ఞవల్క్య, భృగ్వాది మహర్షి కూటమికి చెందిన మహా పురుషుడై అవతరించెను. గుర్వాజ్ఞానుసారముగా గార్హస్థ్య ధర్మమందే నిలిచిరి. జ్ఞానులకు ఆశ్రమముతో పనిలేదు. ఆశ్రమ ధర్మము ఒక సాధన ఒక శిక్షణ. సాధన క్రమములో ఒక అవకాశము. జ్ఞానము కలిగిన పిదప కూడా వారి వారి అవకాశమునుబట్టియు వారి వారి ప్రారబ్ధ విశేషమును బట్టియు, వారి వారి అధికారమును బట్టియు, జ్ఞానులు అనేక విధములుగా సంచరింతురు.

శ్లో॥ కృష్ణో భోగీ సుకస్త్యాగీ నృపౌ జనకరాఘవౌ
వసిష్ఠః కర్మనిరతశ్చ పంచైతేజ్ఞానసత్తమాః

శ్రీకృష్ణుడు అనేక భోగభాగ్యములందు మసలినాడు. శ్రీశుకుడు మహా త్యాగి.



Scanned with CamScanner

జనక చక్రవర్తి, శ్రీరామ చంద్రమూర్తి సింహాసనారూఢులై అఖండ సామ్రాజ్యములను పరిపాలించిరి. వసిష్ఠ మహర్షి ఇక్ష్వాకు వంశీయులకు పురోహితుడై నిత్యమూ కర్మ యోగమును పరి పోషించెను. ఈ యైదుగురు జ్ఞానులలో శ్రేష్టులు, వారి జ్ఞానము సమానమే.

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి గార్హస్థ్య ధర్మమును తీవిగా పరిపాలించి, ఆదర్శ గృహస్థునిగా అఖండ కీర్తి గడించి, గృహజన కల్పతరువై అనేక మంది శిష్య సంతతిని తరింపజేసిరి. ఈ గురుమూర్తి పరిపూర్ణ బోధ వెలయించుటకు వచ్చిన శ్రీ దక్షిణా మూర్తియే.

## శ్రీ శ్రీ శ్రీ

## శ్రీ గురుస్తుతిః

శ్లో॥ అఖండ మండలాకారం యేనవ్యాప్తంచరాచరం
తత్పదం దర్శితంయేన తస్మై శ్రీ గురవేనమః

శ్లో॥ బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వం ద్వాతీతం విమల మచలం సర్వదా సాక్షి భూతం
భావాతీతం త్రిగుణరహితం సద్గురుంతన్నమామి

శ్లో॥ చిత్రం వటతరోర్మూలే వృద్ధాశ్శిష్యా గురుర్యువా
గురోస్తుమౌన వ్యాఖ్యానం శిష్యాస్తుచ్ఛిన్నసంశయాః

శ్లో॥ యాజ్ఞ వల్క్య సమారంభాం శ్రీ కృష్ణ గురు మధ్యమాం
అస్మదా చార్య పర్యంతాం వందే గురు పరంపరాం



Scanned with CamScanner



శ్రీ కందర్ప సూర్యనారాయణ గురు దంపతులు

Scanned with CamScanner

# 1వ ప్రకరణము

అది శ్రావణ మాసము. ఉదయ సమయము. సూర్యభగవానుడు తన అరుణకాంతులచే చీకటులను పోనడచి జీవకోటిని మేలుకొలిపి కార్యోన్ముఖులను చేయు శుభ సమయము. శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి నిత్యకర్మానుష్టానమును పూర్తి చేసుకొని కృష్ణాజినము పై సుఖాసీనులై తపో దీక్షయందుండిరి. జ్ఞానముచే పండిన శిరము. విశాలమైన నుదుట విభూతి రేఖలు అందు పై ఊర్ధ్వముగా కుంకుమ రేఖ అరమోడ్పు కనులు, చేత తులసి మాల ధరించి, ప్రాచీన మహర్షి కూటము నుండి దిగి వచ్చిన ఒక మహర్షి వలె గోచరించిరి. శిష్యుడు భక్తి ప్రపత్తులతో సవినయముగా సాష్టాంగ దండముగా నమస్కరించి చెంత కూర్చుండెను.

మహర్షి :- ఏమి నాయనా ఏమి కావాలని వచ్చావు ?

శిష్యుడు :- భగవత్సాక్షాత్కారము కావాలని వచ్చితిని. అది తమ వలన తమ బోధల వలన లభించగలదని నా విద్యా గురువులు బ్రహ్మశ్రీ కేశిరాజు సత్యనారాయణ గారు చెప్పగా వచ్చితిని.

మహర్షి :- అధమము ఆరు సంవత్సరములు గురు సేవలో పరీక్ష చేసిన తరువాత ఉపదేశమిచ్చుట సనాతన సాంప్రదాయము. కాని సత్యనారాయణ పంపగా వచ్చావు గనుక నీకు పరీక్ష ఏమీ అక్కరలేదు. బ్రహ్మవిద్య యిది వరకు ఎవరి వద్దనైనా అభ్యసించితివా?

శిష్యుడు :- లేదండి మహాత్మా! నాకు ఉపనయనము చేసి బ్రహ్మోపదేశము చేసిన మా



Scanned with CamScanner

నాయనగారు శ్రీమత్ భగవద్గీత, శ్రీ శంకరభగవత్పాదుల గ్రంధరాజములు, శ్రీరామ కృష్ణపరమహంస, శ్రీ వివేకానంద స్వాముల వారి ఉపన్యాసములు బోధలు బోధించగా చదువు కొని ఏదో కొంచెం సాధన చేయుచున్నాను.

మహర్షి :- సద్గురు సాన్నిధ్యమున వారి శిక్షణలో సాధన చేయ వలయునుగాని తనకు తాను చేయుట మంచిది కాదు. ఫల ప్రదముగాదు.

శిష్యుడు :- ఈ కాలంలో కూడ, నవనాగరికత పెచ్చు పెరిగిపోయిన రోజులలో కూడ భగవత్సాక్షాత్కారము సాధ్యమాయని నా సందేహము.

మహర్షి :- ఏ కాలమందైనను, ఏ దేశమందైనను, భగవంతునియందు అనన్యమయిన భక్తి వలన సాక్షాత్కారము తప్పక కలుగును. ఏమీ సందేహము లేదు. అందులకు భృగ్వాది మహర్షులు, వసిష్ఠ వామదేవాది తపోధనులు యాజ్ఞవల్క్య జనక శుక సాందీపాది మహాజ్ఞానులు, శ్రీ శంకర, రామానుజ, మాధ్వ, చైతన్య, భక్త కబీరు దాసు, రామదాసు, పోతన, వేమన, త్యాగరాజు, నిన్నమొన్నటి శ్రీ రామకృష్ణపరమహంస, శ్రీ వివేకానంద, రామతీర్థస్వామి వారి జీవితములు, బోధలే ప్రబల సాక్ష్యములు. కలియుగమునందు భక్తికి మించిన సాధనలేదు. భక్తియందు మంచి సౌలభ్యము కలదు.

శిష్యుడు :- గార్హస్థ్య ధర్మంలో వుండగా నిష్కామ భక్తి యోగము చేయుట బ్రహ్మసాక్షాత్కారము పొందుట అసాధ్యము కాదా? స్వామీ?

మహర్షి :- కాదు నాయనా కాదు భృగు అంగీరస, అత్రి, భరద్వాజ, వసిష్ఠాది బ్రహ్మ ఋషులును, జనక అశ్వపతి మున్నాది రాజఋషులును ఉత్తమ గార్హస్థ్యమును పరిపాలించి బ్రహ్మనిష్ఠాగరిష్ఠులు కాలేదా? మనువు ఇక్ష్వాకు మొదలైన చక్రవర్తులు ఒక

వంక బ్రహ్మవిద్యాభ్యాసము మరియొక వంక రాజ్యపరిపాలనాది సకల వ్యవహారములు కడు నేర్పుతో జేసిరి. మన భారతదేశంలో అనాది కాలం నుంచి సత్సంప్రదాయ సిద్ధంగా, గురుశిష్య పరంపరానుగతంగా నేటి వరకు బ్రహ్మవాహిని అవిచ్ఛిన్నముగా ప్రవహించుచునేయున్నది. అటులెప్పుడునూ ప్రవహించుచునేయుండును. ఇది శాశ్వత ధర్మము. శ్రీమత్ భగద్గీతలయందు శ్రీ కృష్ణపరమాత్మ అర్జుననకు యీ ధర్మము భోదించునపుడు "అర్జునా నీకు నేనిపుడు చెప్పిన యీ ధర్మము నిష్కామ కర్మానుష్ఠాన పూర్వక బ్రహ్మ విద్యను యిపుడు కొత్తగా నేను నీకు చెప్పుటలేదు. ఈ విద్య పూర్వము సూర్యునకు, సూర్యుడు ఆది రాజైన మను మహారాజునకు అయున తన కుమారుడైన ఇక్ష్వాకు చక్రవర్తికి ఉపదేశించినదే. ఈ విధంగా పరంపరానుగతంగా రాజ ఋషులందరూ అభ్యసించి అఖండమైన సామ్రాజ్యములను స్థాపించి పాలించి ధర్మ చక్రమును ప్రవర్తింపజేసిరి. వారి రాజ్యంలో ప్రజలకు సుఖశాంతులకు గాని అన్నోదకములకు గాని యేమీ లోపము లేకుండా వుండేది. తరువాత, తరువాత, మన దేశం పరాధీనమై మన ధర్మము, మన సంస్కృతి మరుగునపడి, పర ధర్మమునందాసక్తులై అందే చరితార్ధతయున్నదని భావించి, స్వధర్మమునకు దూరులై గమ్యము గానక అల్లాడుచున్నారు. స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" అన్నారు శ్రీ కృష్ణ భగవానుడు. గొప్పదైన యీ మన సనాతన సంప్రదాయ సిద్ధమైన ధర్మమును ఆచరించక పోవుట వల్లనే నేటి యీ నీరస స్థితి, యీ పరాధీనత అలుముకొనిపోయినది. ఈ స్థితి శుద్ధ తమస్సు వలన ప్రాప్తించినది కాని వేరు కాదు. ఈ తమస్సు పటాపంచలు కావాలంటే ధీరత్వంతో దేశాభ్యుదయం కొరకు మంచి కర్మాచరణము ముఖ్యము. ఈయకుంఠితమైన నిష్కామ కర్మయోగమునే లోకమాన్య బాలగంగాధర తిలక్, మహాత్మా గాంధి గారలు, వివేకానంద, అరవిందయోగి, తమ త్యాగమయ జీవితములచే



Scanned with CamScanner

చక్కటి బోధలచే, రచనలచే, వుద్యమములచే, నిర్వీర్యమైన భారత జాతిని మేలు కొల్పి కార్యోన్ముఖులను జేసి స్వాతంత్ర్య మహా ఫలమును మన చేతులలో పెట్టి త్యాగమయ జీవితంచే ఈ ఫలమును కాపాడుకోండి అని చెప్పారు. శ్రీ కృష్ణ భగవానుని ఉపదేశము గీతా ధర్మమే మనకు రాచబాట దానిని ఎప్పుడు మరువకుడు అని మహోపదేశము జేసిరి.

పరమ భాగవతోత్తముడైన ఉద్ధవుడు శ్రీ కృష్ణ పరమాత్మను "దేవా! కలియుగంబున సన్యస్త ధర్మము బహుదుష్కరము. నేను ఆ సన్యాసులు బొందు తావు బొందుటయెట్లు? బ్రహ్మాది దేవతలు కూడ బాహ్యావస్తువులయందు భ్రాంతులైయుందురు. నీ భక్తులైన పరమ భాగవతులు ఆ మాయానిరసనము చేయుదురు. గృహిణీ గృహస్థులకైనా, యతులకైనా నిత్యము నీ నామస్మరణము మోక్ష సామ్రాజ్యప్రదము. కావున పరమేశ్వరా! కృపచే నాకుపదేసింపుడు" అని అడుగగా శ్రీ కృష్ణపరమాత్మ యిట్లుపదేసించెను. "కుపథంబుల జనక సన్మార్గవర్తివై పరమంబైన మన్నివాసంబునకుంజనుము, సర్వ మూల శక్తిసంపన్నుడనగు నన్ను సాంఖ్య యోగపరులు నిరంతర భావమునందు పురుష భావంబుగా భావించి తలంచుచుందురు. మరియు నిరంతర ధ్యాననిష్ఠా గరిష్టులయిన యోగీంద్రులు నన్ను సత్య గుణ గ్రాహ్యునిగా నెరింగి నిజ చేతః పంకజము నందు జీవాత్మ పరమాత్మలను ఏకంబుగా జేసి శంఖ చక్ర గాదా ఖడ్గ శార్ఙ్గ కౌమోద కీకౌస్తు భాభరణయుక్తంబుగా నెరుంగుచూ నుండు వారలు పరమయోగీంద్రులనియు పరమ జ్ఞానులనియూ తెలియుము" అని చెప్పుచూ మహర్షి, కుమారా గృహ స్థాశ్రమము విధ్యుక్తముగా నడుపుకొనుచూ సాధన క్రమము ఎలా వుండవలెనో పరమాత్మ యింకనూ ఎలా వుపదేశించారో చూడు.



Scanned with CamScanner

సీ॥ పరధన పరదార పరదూషణాదులు
పరవస్తు చింతదా పరిహరించి
ముదిమిచే రోగంబు లుదయించక నెమున్న
తనువు చంచలతను దగుల కుండ
బుద్ధి సంచలతచే బొదలక, యటమున్న
శ్లేష్మంబు గళమున జేర కుండ
శక్తియుక్తులు మది సన్నగిల్లకమున్న
భక్తిభావనజేత ప్రౌఢుడగుచు

తే॥ దైత్యభంజను దివ్యపాదారవింద
భజన నిజ భక్తి భావన ప్రాజ్ఞుడగుచు
అవ్యయానందమును బొందునను దినంబు
నతడు కర్మ విముక్తుడాయనఘ చరిత

భక్తిచే భగవానుని సాక్షాత్కారమును బొంది భగవానుని యాజ్ఞా పరిపాలన జేయుచూ జీవితమును గడుపుటయే గృహస్థ ధర్మము. పూర్ణ యోగి ప్రవాహ పతితమైన కార్యకలాపములు చేయుచున్ననూ కర్మలేపము లేశమైనా యాతని కంటదు. లోక సంగ్రహము కొరకు సకల కర్మలు చేసియూ అకర్త గానుండి యాత్మానందము పొందుచునే యుండును. మరియు సన్యాసములో ముఖ్య ధర్మము త్యాగము వాసనాత్యాగమే గొప్ప త్యాగము. ఇది మనోధర్మము.

బాహ్యచిహ్నములతో కూడిన సన్యాసాశ్రమము శాస్త్ర సమ్మతమే. శ్రీ శంకర, రామానుజ, మధ్వాచార్య, చైతన్య, శ్రీరామకృష్ణ పరమహంస, వివేకానందాది

మహాపురుషులు త్యాగధనులు. వారి భక్తి జ్ఞానోద్యమములచే మన భారతావనికి తేజస్సు స్ఫూర్తి కలిగించి ప్రజలను సనాతన ధర్మ సన్మార్గ నిష్టులను జేసిరి. వారుపదేశించిన జ్ఞాన వైరాగ్యములచే మోక్షమును బొంద వచ్చును. సద్గురువుల నాశ్రయించి వారుపదేశించిన సాధన జేయుట ప్రధాన విషయము. ఏ ఆశ్రమమైనను సాధన, సాక్షాత్కారము అంతా ఒక్కటే. సాధనసరిగా సాగుటకు అనుకూల పరిస్థితులుంటే సిద్ధికి ఏమీ అభ్యంతరము వుండదు. గృహస్థాశ్రమమునందున్ననూ మహాపురుషుల ఆచరణ అనుసరణీయము. సాక్షాత్కార సిద్ధి కలిగిన జ్ఞానికి అహంకార మను కారములుండవు. అహం లేకుండా అన్ని పనులూ చేస్తాడు. అతడు చేసినా చేయని వాడే. పరమాత్మ చేతిలో కేవలం ఒక పని ముట్టులా అయిపోతాడు. నిమిత్త మాత్రం భవసవ్యసాచిన్ అంటాడు పరమాత్మ, అరవిందాక్షుడు శ్రీ కృష్ణుడు. శ్రీ కృష్ణుని బోధ ఏమి బోధ! ఎంత సులభము, ఎంత రుచికరము. అందరికీ అందుబాటులో వుంటూ పరమ పవిత్రమైన పరమాత్మ సన్నిధానమునకు జేర్చును. సాయుజ్యము ప్రసాదించును. ఎవ్వరూ స్వధర్మమును విడనాడనక్కరలేదు. విడువ వలసినది అహంకారమమకారములు. పరమాత్మయందు పరమ ప్రేమరూపమయిన భక్తి ఒక్కటున్న చాలు. అదొక్కటి వుంటే ఆవు వెంట దూడ వున్నట్లు, అన్ని మంచి లక్షణాలు, అన్ని శుభములు ఆ వెనుకనే అనుసరించును. తన స్వధర్మమును ఆచరించుచూ అంతరంగమున యీ సాధనజేయు శ్రద్ధాభక్తులు గల మానవుడు తప్పక తరించగలడని పరమాత్మ స్పష్టముగా చెప్పెను.

శ్లో॥ మాంహి పార్థవ్యపాశ్రిత్య
యే పిస్యుః పాపయోనయః
స్త్రియా, వైశ్యాస్తదాశూద్రా
స్తేపియాన్తి పరాంగతిమ్

ఎంతటి పాప జన్మ కలవారైననూ, స్త్రీయైననూ, శూద్రుడైననూ, ఏ కులమందు పుట్టిన వారైననూ సరే భక్తి ప్రపత్తులతో భగవానుని ఆశ్రయించిన తరించ వచ్చును.



Scanned with CamScanner

# 2వ ప్రకరణము

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి బ్రహ్మ తేజస్సుతో వెలుగొందుచున్న ముఖార విందముతో సుఖాసీనులై తులసిమాలా విభూషిత కరాబ్జముతో జప యజ్ఞ దీక్షయందుండిరి. శిష్యుడు యథావిధిగా సాష్టాంగ వందనము చేసికొని కూర్చునియుండెను.

మహర్షి :- జపము సాగుచున్నదా నాయనా.

శిష్యుడు :- మనసు స్థిరముగా నిలబడుట లేదు, తండ్రీ.

మహర్షి :- అయిన చెప్పెదను వినుము. చిత్తము స్థిరముగా నిలబడవలెనంటే చిత్తము నిర్మలముగా శుద్ధముగా నుండవలెను. సంశయములకు తావీయకూడదు. "సంశయాత్మా వినశ్యతి" అన్నారు గీతాచార్యులు. చిత్త శుద్ధికి సత్కర్మాచరణము సద్గుణ సంపాదనము చాల ముఖ్యము. ప్రహ్లాదుడు, నారదుడు, శ్రీశుకులు, మున్నగు మహనీయుల గుణగణములలో కొన్నియైననూ సంపాదించవలెను. సత్యము, అహింస, ఋజువర్తనము, మితభాషణము, ఇంద్రియ నిగ్రహము పట్టుదలతో సంపాదించవలెను. సద్గుణ సంపాదనము నియమబద్ధమైన జీవితము ఆత్మోన్నతికి చాలా ముఖ్యము.

శిష్యుడు :- లక్ష్య మనగానేమి ?

మహర్షి :- సగుణసాకారమూర్తిని లక్ష్యముగా నఎంచుకొనవలెను. ఏ మూర్తి యందు నీకు బాగా యిష్టమో, ఏ మూర్తి యందు నీ మనస్సు సునాయాసముగా నిలుచునో ఆ



Scanned with CamScanner

మూర్తియే లక్ష్యముగా నిలుపవలెను. దీనినే యిష్టదైవోపాసనయందురు. సరిగా యిక్కడే మన ఆర్షసనాతన ధర్మము యొక్క ప్రత్యేకత ఉత్కృష్టత యిమిడియున్నది. లోకోభిన్నరుచిః ఈ శ్లోకం విను నాయనా :

శ్లో॥ యంశైవాః సముపాసతే శివయితి బ్రహ్మేతి వేదాన్తినః
బౌద్ధా బుద్ధ ఇతి ప్రమాణ పటవః కర్తే తినైయాయికాః
అర్హన్నిత్యథ జైనశాసనరతాః కర్మేతిమీ మాంసకాః
సోయం విదధాతువాంఛిత ఫలం త్రైలోక్యనాధోహరిః

శ్లో॥ త్రియీసాంఖ్యం యోగః పశుపతిమతం వైష్ణవమితి
ప్రభిన్నే ప్రస్తానే పరమిదమదః పద్యమితిచ
రుచీనాం వైచిత్ర్యాదృజుకుటిల నానాపధజుషాం
నృణామేకో గమ్యః త్వమసిపయసా మర్ణవిఇవ॥

అనియిట్లు పెద్దలు ఏ పేరున కొలిచినా ఒకే దైవాన్ని చేరుతాయన్నారు. సృష్టి సత్వాది గుణత్రయముతో వ్యాప్తమై వాటిమేళనగా నానావిధ భేదములు కలిగియుండుటచే మనుజుల యొక్క బుద్ధులు కూడా నానా విధ భేదములు పొంది విచిత్రముగా నున్నందున ఈ సంసార సముద్రమును తరించి శాశ్వత సుఖమును బొంద కోరిక కలిగినపుడు నీచే సృజింపబడిన అనేక దేవతలు అనేక మంత్రములు అనేక శాస్త్రములు అనేక మతములు ప్రపంచమున కలిగియున్నందున సమిష్టిని వేద సమ్మతములనియు వ్యష్టిగా వేరైనట్లు కనుపించినా ఒకే గమ్యము గలవి. జగత్తునందలి నదులన్నింటికి ఋజు కుటిల గమన భేదములు, మంద్ర తీవ్రవ్య వధానభేదములూ వున్ననూ సముద్రడొక్కడే



Scanned with CamScanner

ప్రాప్యస్థానముగునట్లు ఆయామతముల వారందరకు నీవే (ఒక్క దైవమే) గమ్యస్థానము.

ఇష్ట దైవమును మనసున నిలిపి భక్తి శ్రద్ధలతో మంత్ర జపము చేయుచూచేయుచూ మానసికార్చన చేయుచుండ వలెను. మానసికార్చన బాగా సిద్ధించని యెడల ఒకపటమునో, విగ్రహమునో నిలిపి ఆ మూర్తికి షోడశోపచారములతో పూజ చేయువలెను. ఆలాగు చేయగా చేయగా మానసికార్చన సిద్ధించును. అనగా సగుణ సాక్షాత్కారము కలుగును. భగవానుడు దర్శన మిచ్చును. దర్శనము లభించని యెడల అది మన భక్తి భావనాదార్ఢ్య లోపముగాని భగవానుని దయాలోపముగాదు. భగవానుడు దయా సముద్రుడు. శ్రీమన్నారాయణుడు నరసింహావతారమెత్తి స్థంభము నుండి వచ్చినాడంటే అది ప్రహ్లాదుని భక్తి భావనా బలముచేతనే. ఇది ఒకప్పుడు సత్యము, ఒకప్పుడు అసత్యము కాదు. ఇది నిత్య సత్యం. ఈ కలియుగమున భక్తికి మించిన సాధనలేదు. భక్తి లేనిదే యే యోగము సిద్ధించదు. భక్తి అన్నియోగములలోను అంతర్గతమైయున్నది. అద్వైత స్థాపనా చార్యులైన శ్రీ శంకర భగవత్పూజ్య పాదులు గూడ "మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ" అన్నారు. నారద మహర్షి భక్తియనగా సాత్వస్మిన్ పరమ ప్రేమానురూపా" అని నిర్వచించారు. దైవమందు అఖండ ప్రేమే భక్తి. శ్రీ శంకర భగవత్పాదుల వారు శివానందలహరిలో చక్కటి ఉదాహరణ ద్వారా భక్తిని వివరించారు.

శ్లో॥ అంకోలం నిజబీజ సంతతి. రయస్కాంతో పలం సూచికా
సాధ్వీనైజ విభుంలతాక్షి తిరుహం సింధుస్సరిద్వల్లభమ్
ప్రాప్నోతీహయథాతథా పశుపతేః పాదారవింద ద్వయం
చేతో వృత్తిరుపేత్య తిష్ఠతిసా భక్తి రిత్యుచ్యతే



Scanned with CamScanner

ఊడుగు చెట్టు నుండి పండు భూమి మీద పడగానే అందులోని గింజలన్నీ మరల అంటుకొని పోవునట్లు, సూదిని సూదంటురాయి దగ్గరకు తీసుకొని రాగానే అది దానిని అంటుకుపోయినట్లు పతివ్రత అయిన స్త్రీ ఎల్లపుడూ తన భర్తనే భావనజేయుచూ తదేక మానసముతో వుండునట్లు, లత యెల్లపుడూ యేదో యొక చెట్టును ఆశ్రయించియుండునట్లు, నది కొండలలో పుట్టి, కొండలు, లోయలు, గుట్టలు యెన్ని అడ్డం వచ్చినా అన్నింటిని తన వేగముచేయధి గమించి సముద్రముని కలియునట్లు సహజముగా సర్వేశ్వరుని పాదపద్మములయందు చిత్తవృత్తి యెల్లపుడు నిలిచియుండుట భక్తియనబడును.

భక్తి నిష్కామము సహజము అయినచో ఫలము అమోఘము. ముక్తి కరతలామలకము. శ్రీకృష్ణుడు మధురానగర ప్రవేశము చేసినపుడు సుదాముని పరిచర్యలకు మెచ్చి నీకేమి కావలయునో కోరుకొనుమనగా ఆతడిట్లంటాడు. యెంతటి నిష్కామ భక్తుడో!

నీ పాదకమల సేవయు
నీ పాదార్చకుల తోడినెయ్యమునునితాం
తాపార భూత దయయును
తాపస మందార నాకు దయసేయగదే

భాగవత ధర్మము చాలా ఉత్తమమైనది. 'భ అనగా భక్తి 'గ అనగా జ్ఞానము. 'వ' అనగా వైరాగ్యము. 'త' అనగా తత్వము. భాగవత ధర్మమునగా భక్తి జ్ఞాన, వైరాగ్య తత్వజ్ఞానముల మేలు కలయిక. వీటిలో యేది లేకున్ననూ అసంపూర్తియే. భక్తి జ్ఞాన వైరాగ్యములు లేనియే సాధనయైనను భగవద్దర్శన భాగ్యము కలిగించదు. పాలు, పంచదార



Scanned with CamScanner

వలె జ్ఞానము భక్తి కలిసి యుండవలెను. భక్తిలేని వేదాంతము శుష్క వేదాంతముగా పరిణమించును. జ్ఞానము లేని భక్తి ముక్తి ప్రదము కాదు. అందుచేతనే నారదాది మహనీయులు భాగవత ధర్మము ప్రచారము చేసిరి. వాల్మికి మహర్షికి శ్రీరామతత్వమును, శ్రీ వ్యాస మహర్షికి శ్రీ కృష్ణతత్వమును ఉపదేసించి శ్రీమద్రామాయణ మహా భాగవతముల ద్వారా భాగవత ధర్మము వెలయింపజేసినది నారద మహర్షియే.

శిష్యుడు :- సాధనయందు సద్గురుని యవసరము యెంతవరకు కలదు ?

మహర్షి :- ఏ సాధనయందైననూ సద్గురుని అవసరము పూర్తిగా కలదు. ఇక మోక్ష సాధనయందు సద్గురు మూర్తి అవసరము, ప్రభావము యింతింతయని చెప్పనలవి కాదు. ముఖ్యంగా మూడు వుంటే ముక్తి కరతలామలకమన్నారు శంకరులు.
(1) మనుష్యత్వము (2) ముముక్షత్వము (3) మహా పురుష సంశ్రయము. మహాపురుషులుగా సద్గురు మూర్తి. ఆధ్యాత్మిక విద్య మాట అలా వుంచి లోకములో చాలా చిన్న పని మొదలు అతి పెద్ద విద్య వరకూ గురువు యొక్క అవసరము లేకుండా యెక్కడున్నది. ఇక అతి నిగూఢమైన, అతి గంభీరమైన అవాఙ్మానసగోచరమైన ఆధ్యాత్మ విద్య మాట చెప్పేదేమిటి. గురువు అత్యవసరము.

శిష్యుడు :- గురువెట్లుండును? గురుమూర్తిని గుర్తించుటయెట్లు?

మహర్షి :- గురువును గుర్తించుట కష్టమే "ఉప్పు కప్పురంబు నొక్కపోలిక నుండు, చూడజూడ రుచుల జాడ వేరు". అసలు ముఖ్యముగా ఆధ్యాత్మ విద్యాసాధనకు నిర్మలమూ పరిశుద్ధము అయిన చిత్తముండవలెను. చిత్త శుద్ధి కొరకు శ్రీ కృష్ణపరమాత్మ నిష్కామకర్మానుష్టానమును ఉపదేసించెను. సద్గుణములను ప్రయత్న పూర్వకముగా



Scanned with CamScanner

అభ్యసించవలెను. ఇంద్రియ నిగ్రహము, సత్యము, అహింస, శౌచము, యివి సాధనయందు చాలా ముఖ్యము.

## 1. ఇంద్రియ నిగ్రహము

సాధనయందు ఇంద్రియ నిగ్రహము చాలా ముఖ్యమైనది. బాహ్యమైన యే వస్తువునందును ఆశ వుండరాదు. విషయ జయమనగా అదే. విషయములను జయించిన గాని మనోజయము చేకూరదు. మనస్సును జయించిన గాని ఆత్మదర్శనము కలుగదు.

ఆత్మవశ్యైర్విధేయాత్మా
ప్రసాదమధిగచ్ఛతి (భగవద్గీత)

మనస్సు స్వాధీనమయిన వానికే ఆత్మ ప్రసాదము లభించును. "మనస్సు స్వాధీనమైన మరి మంత్ర తంత్రము లేల" (త్యాగరాజ స్వామి)

యే ఆశ్రమమందున్న వారికైనా యిది చాలా ముఖ్యము. గృహ స్థాశ్రమ మందున్న వారికి సద్బ్రహ్మచారి సదోపవాసియని రెండు ధర్మములు చెప్పబడినవి. అగ్ని సాక్షిగా వివాహము చేసుకొనిన ధర్మపత్ని యందు శాస్త్ర సమ్మతముగా నియమముతో ప్రవర్తించుచూ, అన్యకాంతలయందు మాతృ భావము సలుపుచూ, సత్సంతానమును బడసిన పిమ్మట పూర్తి బ్రహ్మ చర్యనిష్ఠతో నుండుట సద్బ్రహ్మ చర్యమనబడును. రోజుకు రెండు సార్లు మితముగా భోజనము చేయుచూ మధ్య మధ్య యితర పదార్థము లేవియు తినకుండా వుండుట సదోపవాసిత్వమనబడును. బ్రహ్మ చర్యము వలన బుద్ధి బలము పెరుగును. ఆరోగ్యము హెచ్చును. బ్రహ్మ చర్యనిష్టయే గొప్ప తపస్సు.



Scanned with CamScanner

## 2. సత్యము

సత్యము పలుకుట వాక్కుచే చేయు తపస్సు. సత్య వ్రతమునకు శాస్త్రము, మహనీయులు చాల ప్రాముఖ్యమిచ్చిరి. ఒక్క సత్యము ఆరాధించుటచే హరిశ్చంద్రుడు రాజర్షి ఆయెను. అతని కీర్తి ఆచంద్రార్కము నిలిచెను. సత్యవాక్పరిపాలనకై దశరధ మహారాజు శ్రీరామ చంద్రుని కానలకు పంపెను. సూర్య వంశ చక్రవర్తులందరు సత్యమును ఆరాధించియే రాజ ఋషులని కీర్తి గడించిరి. నేటి కాలములో గాంధీ గారు సత్య నిష్ఠ వలననే మహాత్ముడయ్యెను. మహత్తర కార్యములను సాధించెను. లోకోత్తర పురుషుడని ఖ్యాతి గాంచెను.

## 3. అహింస

మనోవాక్కాయములచే యే ప్రాణికి హింస చేయకుండుట అహింస యనబడును. ఈ సుగుణ సంపాదన వలన ఆత్మవత్ సర్వభూతాని అన్న భావన ధృఢమై క్రమముగా ఒకే ఆత్మ తన లోను అన్ని జ రాసులలోను గోచరించును.

"తనయందు అఖిల భూతములందు ఒక భంగి
సమహితత్వంబున జరుగువాడు" అని ప్రహ్లాదుని గూర్చి పోతనామాత్యులు భాగవతమున వర్ణించినారు. "అహింసా పరమో ధర్మః", అని ఒక్క పరమ ధర్మమును బోధించి బుద్ధ భగవానుడు గొప్ప మత స్థాపకుడాయెను.



Scanned with CamScanner

# 4. గురు భక్తి

ఆచార్యోపాసనము సాధనలలో తలమానికము వంటిది అని శ్రీకృష్ణ పరమాత్మ గీత యందు పల్కెను. ఒక్క గురు భక్తియను సాధనచే పొందవలసిన దంతయూ పొందవచ్చును. అణకువతో మెలుకువతో, భక్తితో సద్గురుమూర్తికి సేవ చేసిన పుణ్య పురుషునకు యితర సాధనలతో పనియేయుండదు.

శ్లో॥ యస్యదేవే వరా భక్తిః
యధా దేవే తధా గురౌ (గురు గీత)

దేవుని యందు ఎట్టి భక్తి కలదో అట్టి భక్తి ఆ పరమాత్మను చూపించెడి గురువు నందుండ వలెను.

శ్లో॥ యోగురుః సశివః ప్రోక్తో
యశ్శివః సగురుః స్మృతః
వికల్పం యస్తుకుర్వీత
సనరో గురు తల్పగః ।

పరమాత్మ స్వరూపమును తెలియ జేయునట్టి గురువు ఈశ్వరుడుగాను, ఈశ్వరుడు గురువుగాను చెప్పబడినది. ఈ విషయములో సంశయము గల మానవుడు గురు భార్యను పొందిన దోషము కలవాడగుచున్నాడు.

శిష్యుడు :- అట్టి గురువు యెట్లుండును ?

గురువు :- సద్గురువు లక్షణములు యిట్లు చెప్పబడినవి.

శ్లో॥ నిరస్త సర్వ సందేహో
ఏ కీకృత్య సుదర్శనం
రహస్యం యో దర్శయతి
భజామి గురు మీశ్వరం (గురుగీత)

ఎవరు సర్వ సంశయములును పోయిన వాడై ఏకత్వము పొంది పరమ రహస్యమయిన అచల పరిపూర్ణ పరబ్రహ్మను చూపించుచున్నాడో అట్టి ఈశ్వర స్వరూపుడైన సద్గురు స్వామిని సేవించుచున్నాను.

శ్లో॥ జ్ఞానహీనో గురు స్త్యాజ్యః
మిధ్యావాదీ విడంబకః
స్వ విశ్రాంతి నజానాతి
పరశాంతింకరోతికిం?

జ్ఞానహీనుడైన గురువు త్యజింప తగిన వాడు. మిథ్యావాది, మందుడు తన యొక్క శాంతిని తెలుసుకొనలేని వాడు యితరులకు ఎట్లు శాంతి మార్గము తెలియజేయగలడు?

శ్లో॥ నవందనీయాః స్తే కష్టం
దర్శనా ద్భ్రాంతి కారకాః
వ ర్జయే త్తాన్ గురూన్ దూరే
ధీరంజ్ఞంతు సమాశ్రయేత్॥

దర్శన మాత్రము చేతనే భ్రమజ్ఞానము కలుగజేసెడి గురువులు నమస్కారార్హులు



Scanned with CamScanner

కారు. అట్టి గురువులను దూరముగా విడిచిపెట్టి, ధైర్యశాలియగు జ్ఞానిని యాశ్రయించవలెను.

శ్లో॥ గూఢో దృఢశ్చ ప్రీతశ్చ
మౌనేన సుసమాహిత:
సకృత్కామగతోపివా
పంచధా గురురీరిత:

సద్గురువు గంభీర వృత్తి గలవాడును ధైర్యము గలవాడును, సంతోష చిత్తుడును, మౌనముతో నుండు వాడును ఏకపత్నీవ్రతుడును యీ అయిదు లక్షణములు కలవాడు గురువని చెప్పబడును. గూఢో అనగా తన యొక్క బ్రహ్మనిష్టను రహస్యముగా చేసుకొనువాడు అని అర్థం. సకృత్ కామ మనగా ఏకపత్నీవ్రతము. ఇది గృహస్థాశ్రమము పరిపాలించు గురువులకు వర్తించును. సద్గురువులు యత్యాశ్రమమున, గృహస్థాశ్రమమున యుందురు. సద్గురువులు, యోగులు వారి ఆశ్రమ ధర్మములను అనుష్టించుచు లోకమునకు మార్గ దర్శకులై యుందురు. సర్వకాల, సర్వావస్థలయందు తపోనిష్ఠులై, "ప్రవాహపతితం కార్యం కుర్వన్నపినలిప్యతే" "అను న్యాయానుసారము అలేప వాదమాశ్రిత్య శ్రీకృష్ణజనకాయధా" అన్నట్లుగా ప్రవర్తింతురు.

ఎంతటి మహానుభావులయినను సద్గురు సేవ విధ్యుక్తముగా ఆచరించి తరించి నట్లు పురాణములు, చరిత్రలు చెప్పుచున్నవి. శ్రీ రామచంద్రుడు వశిష్ట భగవానునికి శిష్యుడయ్యెను. శ్రీకృష్ణుడు సాందీపుల వారిని సేవించెను. జనక చక్రవర్తి యాజ్ఞ వల్క్య మహర్షి వద్ద బ్రహ్మ బోధబడసెను. శంకర భగవత్పాదులు శ్రీ గోవింద భగవత్పాదుల వారి పాదపద్మములు సేవించిరి. శ్రీరామకృష్ణ పరమహంస శ్రీతోతాపురి వలన బ్రహ్మనిష్టాగరిష్టుడయ్యెను. వివేకానంద శ్రీరామ కృష్ణ పరమహంసను సేవించెను.



Scanned with CamScanner

ఇట్లు ఎందరో మహానుభావులు శిష్య సంతతిని తామంతటి వారినిగా తయారు చేసి బ్రహ్మ విద్యావాహినిని సృష్ట్యాది నుండి నేటి వరకు అవిచ్ఛిన్నముగా ప్రవర్తింపజేసిరి. కనుకనే మన మతము నాటి నుండి నేటి వరకు యెన్ని అడ్డంకులు వచ్చినా పరమ పవిత్రమైన గంగా నది వలె అవిచ్ఛిన్నముగా గురుపరంపరాగతముగా సజీవముగా వచ్చుచున్నది. అనేక రాజ్యాలు వచ్చాయి. రాజ్యాలు వెళ్లాయి. పరరాజ్యాలు వచ్చాయి. అవి కూడా అంతరించాయి. ఎన్ని మార్పులు యెంతయెలా వచ్చినా యీ సనాతన ధార్మిక విద్యా వాహినిని మాత్రము యేదీ యేమీ చేయలేదు, చెయ్యలేవు. ఒకపుడు మరుగున నుండును. మరి యొక్కప్పుడు మాధ్యందిన మార్తాండుని వలె దేదీప్యమానంగా దాని కాంతులను దశదిశల వెదజల్లుచూ, సర్వమానవాళికి భక్తి జ్ఞాన వైరాగ్యములను ప్రసాదించి సుఖశాంతులను కలుగజేయుచున్నది. సమస్త కళలను వికసింపజేసినది. మానవుని జీవితమునే చీకటి నుండి వెలుగునకు, దుఃఖము నుండి ఆనందమునకు, మృత్యువు నుండి అమృతత్వమునకు పురోగమింపజేసెను. నేటి కాలములో వివేకానందస్వామి ఏమి చేసినారో చూడుడు. వేదాంత భేరీని యావత్ప్ర పంచములో మ్రోగించినారు. పశ్చిమ ఖండమునకు వెళ్లి సనాతన ధర్మ ప్రచారము అతిసమర్థవంతముగా చేసెను. శ్రీ రామకృష్ణమఠములను స్థాపించి శిష్యసంతతిని తయారు జేసి ప్రాక్పశ్చిమఖండములకు వారధి కట్టెను. ఆయనను అనుసరించి తరువాత శ్రీరామ తీర్థ స్వామి, డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు ఆ వుద్యమమును బాగుగా యినుమడింప జేసిరి. మరియు అనేక మంది ఆచార్య పురుషులు అమెరికామున్నగు యితర దేశములను, దేశస్థులను వారి భోధల ద్వారా, వారి ఉపన్యాసముల ద్వారా, వారి రచనల ద్వారా మన సంస్కృతిలోని వైశిష్యముచే ప్రభావితులను గావించిరి. ఈ పరిణామము ప్రపంచమునకే శుభోదయం.



Scanned with CamScanner

# 3వ ప్రకరణము

కర్షకుడు భూమిని దున్ని నీటిచే తడిపి కలుపు మొక్కలు తీసివేసి విత్తనములు నాటినట్లు సద్గురుమూర్తి సద్గుణ పుంజముచే శుద్ధాంతఃకరణము కలిగిన శిష్యునకు వానియిష్ట దేవతాక మయిన మంత్రము నుపదేసించును. ఇప్పుడు ఈ శిష్యునకు కలిసంతారణోపనిషత్తులో బ్రహ్మ నారదునకుపదేశించిన "హరే రామ హరే రామ" - అను ముప్పది రెండక్షరముల మహా మంత్రము నుపదేసించిరి.

మహర్షి :- కుమారా ! ఇది కలియుగము. ధర్మము ఒక్క పాదము మీదనే ప్రపంచము నడుచుచున్నది. అయితే అంత మాత్రమున మనము నిరాశ చెందనవసరము లేదు. ఆ ఒక్కపాదము నడుచుచుండుట చేతనే యీ ప్రపంచము యీలాగ నిలిచియున్నది. "ధారణాత్ ధర్మః" ఈ ప్రపంచమును ధరించి నడిపించుచున్నది "ధర్మము" తక్క వేరేమియుగాదు. ఈ ప్రపంచములో సుఖశాంతులు లోపించిన వంటే ధర్మము, ధార్మిక విధానములు ప్రజలలో లోపించుట వలననే కాని వేరొండుకాదు. బుద్ధ భగవానుడు ధర్మ చక్రమును ప్రవర్తింపజేసెను. అశోక చక్రవర్తి ఆ ధర్మమును నలుదిశలా దేశదేశాంతరముల వరకూ వ్యాప్తి జేసెను. అయినా అలసులు, మంద బుద్ధులు, దురాచారపరులు ఆ ధర్మమునకు హాని కలిగించినప్పుడు, మన భారతావనియందు కుమారిల భట్టు, శంకర, రామానుజ మధ్వాచార్యాది మహా పురుషులుదయించి, కర్మ జ్ఞాన, భక్తి వైరాగ్యములతో కూడిన స్వచ్ఛమైన వైదిక ధర్మవృక్షమును పునఃప్రతిష్టించి నాటికి నేటికి మనకే కాక సర్వమానవాళికి ఉపకారమొనరించిరి. ఆ ఒక్క పాదము ధర్మముండుట చేతనే నాకు నీకు మధ్య బ్రహ్మ విచారణ సంభవించినది.

ఇప్పటి దేశకాల పరిస్థితులలో యజ్ఞ యాగాదిక్రతువులు బాగా సాగవు.



Scanned with CamScanner

సదాచారము సలుపుట చాలా కష్టము. ఈ మంత్రానుష్ఠానమునకు యెక్కువ ఆచార వ్యవహారములు అక్కరలేదు. శుచి శుభ్రతలతో సుఖాసీనుడై ఏకాంత ప్రదేశమున మంత్ర జపము చేసుకొనవలెను. భగవానునియందు భక్తి భావము ప్రధానము. చిత్తము విశ్రాంతి పొందును, ఆనందము కలుగును. భక్తి తీవ్రమైనకొలది సాక్షాత్కారము కలుగును.

శిష్యుడు :- బాహ్య పూజ అవసరమా? ఒక విగ్రహమును పెట్టుకొని పూజలు చేయవలెనా? విగ్రహారాధన ముఖ్యమా?

మహర్షి :- మనసు లగ్నమగుటకు మహర్షులు అనేక ఉపాయములను ఉపదేసించిరి. దేవాలయములందలి చక్కటి విగ్రహములు యింట్లో దేవతార్చన చేసుకొనుటకు సాలగ్రామములు మొదలగు పవిత్ర చిహ్నములు, బీజాక్షరములతో కూడిన యంత్రములు రూపొందించిరి. ప్రారంభదశలో వీటి అవసరము ఎంతైనా వున్నది. ఉపాసన ప్రారంభ దశలో మనసు నిలుచుటకు ఒక ఆలంబనము కావలెను. అవి ఆకర్షణీయముగా వుండవలెను. దాని యందు మనసు సులువుగా నిలుచును. ఇట్లు బాహ్య పూజ చేయగా చేయగా సులువుగా మానసికార్చన కుదురును. అపుడు మన యిష్ట దైవమును మనసునందే నిలిపి షోడ శోపచారములు చేయనగును. ఇట్లు నిష్టగా ఉపాసన చేయగా చేయగా సాక్షాత్కారము సిద్ధించును. ఇష్టదైవ దర్శన భాగ్యమబ్బును. శ్రీ సీతారామ చంద్రుని దర్శన భాగ్యమబ్బును. ఇందుకు సందేహము లేదు. "సంశయాత్మావినశ్యతి" నేను సంశయాత్మలకు అగ్రాహ్యాండను అన్నారు కృష్ణ పరమాత్మ. ఒకనాడు తులసి కోట దగ్గర కూర్చుని జపము చేసుకొనుచుండగా ఆకు ఆకు మీద రాముడు అగుపడెను. ఇపుడు నీతో మాట్లాడుచుండగా ఒక్కసారి దర్శనమిచ్చి అంతర్ధానమయినాడు. అబ్బాయీ ఏమి రాముడు ఏమి అందము ఏమి ఆనందము.



Scanned with CamScanner

ఏమి భాగ్యము. ఏ మూర్తియందు నీవు మనసు నిలిపినా భగవానుడు నీకు ఆ మూర్తిగానే సాక్షాత్కరించును. అందుకే శ్రీకృష్ణ పరమాత్మ గీతలో "యేయథా మాంప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం" అన్నారు. ఇక్కడనే వున్నది మన మతము యొక్క విశిష్టత. మానవులు ఎవరి ఎవరి అభిరుచిననుసరించి ఏయే దేవతను ఉపాసించినా కడపటికి ఒక్క పరబ్రహ్మకే చెంది చేరెదరు . "ఆకాశాత్ పతితంతోయం యధాగచ్ఛతిసాగరమ్, సర్వదేవనమస్కారః శ్రీ కేశవం ప్రతిగచ్ఛతి" "ఏకం సద్విప్రాబహుదావదంది" అని శృతి వాక్యం. మన భారతీయ సంస్కృతి లోగల సర్వమత సామరస్య భావమునకు యిదే మూలము. అందు చేతనే సర్వ ప్రపంచములోగల మానవాళికి సమ్మతమైన మతము హిందూమతమే కాగలదు. ఈ రీతిగా లోక కళ్యాణ మునకు విశ్వశాంతికి కారణము కాగలదు. అందుకే మహాత్ములు "విశ్వస్య కళ్యాణమస్తు లోకాస్సమస్తాః సుఖనోభవంతు" అని ఆశీర్వదింతురు.

శిష్యుడు :- స్వామీ ! తారక మంత్రమును గురించి కొంచెము వివరింపుడు.

గురువు :- నాయనా ! శ్రీరామ చంద్రపరమాత్మ మంత్రమునకే తారక మంత్రమని పేరు. శ్రీరామ షడక్షరీ మహామంత్రము చాలా గొప్ప మంత్రము. నిత్యమూ సాక్షాత్ సదాశివుడు ఈ మంత్ర రాజమును జపము చేయును. పార్వతీ దేవికి పరమేశ్వరుడే స్వయముగా ఈ మంత్రానుష్టానము ఉపదేసించెను. మరియు కాశీక్షేత్రములో దేహ త్యాగముజేయు ప్రతి జీవునకు కుడి చెవిలో విశ్వనాధుడు ఈ మంత్రమును ఉపదేసించును.

"ఓం నమోనారాయణాయ" అను నారాయణాష్టాక్షర మంత్రము లోని 'రా' అనుబీజమును, ఓం నమశ్శివాయ అను పంచాక్షరి మంత్రములోని 'మ' అను బీజమును



Scanned with CamScanner

చేర్చిన 'రామ' అను మహా మంత్రము సిద్ధించును. ఈ మంత్రానుష్ఠానమునకు ఎక్కువ నియమములు అక్కరలేదు. తాను శుచియై ఏకాంతమున కూర్చుని శ్రీ సీతారామచంద్రుని మానసమున భావన చేసి ఈ మహామంత్రము పురశ్చరణ చేయవలెను. అలాగ చేయగా చేయగా రామనామములోని తీపి దొరకును. అంతరంగము నిశ్చలతనొందును. ఆనందము కలుగును. మనసుకు బలము చేకూరును. ఈ మంత్రానుష్ఠాన బలము చేతనే వాల్మీకి గొప్ప మహర్షియై ఆది కవియై లోకమున శ్రీమద్రామాయణమును వెలయించి ఆజరామరమయిన కీర్తి గడించెను. శ్రీ పోతనామాత్యుడు తాను తెనుగు జేసిన భాగవతములో రామనామామృతములో వుండే మాధుర్యమును ప్రతి పదమునందు ప్రతి పద్యమునందు నింపి ఆంధ్ర లోకమునకు మహోపకారమొనర్చెను. శ్రీత్యాగరాజ స్వామి యిటు సంగీతమునకు అటు తెలుగు సాహిత్యమునకు తలమానికముగా కీర్తనలను రచించి శ్రీరామ భక్తి సామ్రాజ్యమును నాటికి నేటికి ఒక్క తెలుగు నేలకే పరిమితముగాక యావద్భారతావనియందు సుప్రతిష్ఠిత మొనరించెను. మరియు ఆంధ్ర దేశమున భద్రాచల రామదాసు, మహారాష్ట్రమున శ్రీ సమర్థరామదాసు ఉత్తర భారతమున శ్రీతులసీ దాసుగారు రామనామ ప్రభావము గురించి బహుళ ప్రచారమొనరించి లోకమును తరింపజేసిరి.

శ్రీరామచంద్ర పరబ్రహ్మతత్త్వమును ఆధ్యాత్మ రామాయణములో విపులముగా విశదీకరించిరి. ఆధ్యాత్మరామాయణ పారాయణ విశేష మహిమగలది. అందులో శ్రీ రామ హృదయము సారభూతము. శ్రీరామ చంద్రుడు భక్తాగ్రేసరుడైన ఆంజనేయ స్వామికి తన యొక్కయు సీతా దేవి యొక్కయు నిజతత్త్వము తెలిపి కృతార్థుని చేసిన ఘట్టము. ఆతత్త్వమును గురించి పారాయణ మనన నిధి ధ్యాసములచే మనమూ తరించగలము. అది పార్వతీ దేవికి పరమేశ్వరుడు చేసిన ఉపదేశము.

శిష్యుడు :- మంత్ర శాస్త్రము చాలా గొప్పదని అనెదరు. అనేక మంత్రములు



Scanned with CamScanner

గలవందురు. దానిని గురించి కొంచెము తెలుపగోరెదను.

మహర్షి:- మంత్ర శాస్త్రము చాలా గొప్పది. చాలా పెద్దది. సందేహములేదు. ఒక్కొక్క దేవతా మూర్తిని ఉద్దేసించి ఒక్కొక్క మంత్ర భాగముదయించినది. అసలు వేదమే మంత్రమయము. ఏ దేవతను తన యిష్టదైవముగా నెంచుకొనునో ఆ దేవతా మంత్రమును ఉపాసించవలెను. అపుడే మనసు బాగా ఏకాగ్ర మగును. ఆ దేవతా మూర్తి యందే భక్తి బాగా అభ్యసించవలెను. కాని తక్కిన దేవతలయందు ద్వేషమిసుమంతయైనను పనికి రాదు. అందుకే ఆది శంకరభగవత్పాదాచార్యుల వారిని షన్మత స్థాపనాచార్యులనిరి. వారు పంచాయతన పూజ బహుళ ప్రచారములోనికి తెచ్చిరి. తన యిష్ట దైవమును మధ్యన పెట్టి తక్కిన నాలుగు దేవతలను నాలుగు కోణములయందుంచి పూజ చేయవలెను. ఇదే పంచాయతన పూజ. చూడునాయనా ఇది యెంత మతసామరస్యము కలదో. అంత మత సామరస్యము నేటి కాలమున శ్రీరామకృష్ణ పరమహంస తాను అనుష్ఠించి, చూపి లోకమునకు బోధించిరి. ఇంకను వారు మన హిందూ మత ధర్మానుష్ఠానమునే గాక ఇస్లామ్, క్రైస్తవ మత ధర్మములోని మర్మములను కూడా తెలిసికొని, అనుష్ఠించి, దర్శించి, మార్గము ఏదైనా గమ్యస్థానము ఒకటే "ఏకంసద్విప్రా బహుధావదన్తి" అని ఎలుగెత్తి చెప్పిరి. కనుకనే నేటి కాలమున ఒక్క భారత దేశమునే గాక ఖండఖండాంతరములయందు శ్రీవారి ముఖ్య శిష్యుడు నరోత్తముడయిన శ్రీవివేకానంద స్వామి, శ్రీ రామకృష్ణ బోధామృత ధారలను తేనెలొలుకు పలకులతో మేరునగ గాంభీర్యముతో వెలయించి యావత్ ప్రపంచమునకు గొప్ప మేలొనరించిరి.

"మననాత్త్రాయతే ఇతి మంత్రః" మననము చేయు వానిని తరింపచేయునది గాన మంత్ర మనబడును.

శిష్యుడు :- మంత్రము సిద్ధించుటయనగా వివరింపుడు.

మహర్షి:- మంత్ర దేవత సాక్షాత్కరించుటే మంత్ర సిద్ధియందురు. సగుణ సాకారమూర్తి మనోనేత్రమునకు, అనగా జ్ఞాననేత్రమునకు సాక్షాత్కరించును. ముందు సద్గురుమూర్తిని లెస్సగా ధ్యానించి పిదప యిష్ట దైవమును ధ్యానించవలెను. అలాగ చేయగా చేయగా ఒకే సింహాసన మందు ఒక పరి గురుమూర్తి ఒక పరి యిష్ట దైవమూ ఆసీనులయినట్లు గోచరించును.

శిష్యుడు :- శక్తిపాతమనగా నేమి? అందలి రహస్యము సెలవిండు.

మహర్షి:- సద్గురు వనగా బ్రహ్మసాక్షాత్కారము బడసిన మహనీయుడు బ్రహ్మజ్ఞాని "బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి" ఆయన సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపమే. బ్రహ్మ శక్తి ఆయనయందు నిక్షిప్తమైయుండును. శిష్యులకు సంసార తాపోపశమనము జేసి జ్ఞాన వికాసము కలిగించు శక్తి వారియందుకలదు. గురుభక్తి సదాచార సంపత్తి, సౌశీల్యాది సద్గుణ పుంజముచే అర్హత సంపాదించుకొన్న శిష్యుని యెడల వారికి వాత్సల్యము కలిగి మంత్రము యిచ్చినపుడు మంత్ర శక్తి కూడా ప్రసాదింతురు. ఇదియే శక్తిపాతము. ఇంకను మహనీయులు సమర్థులయిన శిష్యులకు దృగ్దీక్ష ద్వారా ఆత్మవికాసమును ప్రసాదింతురు. మరియు స్పర్శవలన అనగా హస్తమస్తక సంయోగము వలన కృతార్థునిజేతురు.

శిష్యుడు:- సగుణోపాసన నిర్గుణోపాసనల వివరములను తెలుసుకొన కోరెదను.

మహర్షి:- సగుణోపాసన యందు సౌలభ్య మెక్కువగా యుండును. సకల కళ్యాణ గుణాకరుడు, కోటి మన్మధ లావణ్య, సుగుణ, సుందర మూర్తి యగు పరమేశ్వరుని యందు మనసు సునాయాసముగా లగ్నమగును.

శ్లో॥ క్లేశో ఽధికతరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్
అవ్యక్తాహిగతిర్దుఃఖందేహవద్భిరవాప్యతే

అని భగవద్గీతలయందు కృష్ణపరమాత్మ పలికెను. అనగా అవ్యక్తమగు నిర్గుణ నిరాకార సాధనము చాలా కష్టము. దేహ స్మృతి వీడని వారికి ఈ ఉపాసనలో ప్రయత్న సిద్ధికలుగక నాస్తికులుగా మారిపోయే ప్రమాదము కూడ వున్నది. శూన్యవాదులంతా యీ కోవకు చెందినవారే. ఆధునిక భారత దేశములో బయలుదేరిన ఉద్యమములలో చాలా వాటి యందు యీ పొరబాటున్నది. శుద్ధ నిర్గుణ నింరజన నిర్వికార పరబ్రహ్మమును గురించి ప్రవచించిన వారిలో ఈ కలియుగమున జగద్గురు శంకర భగవత్పాదుల వారి కంటె ఎక్కువైన వారెవ్వరైనా ఉన్నారా? వారు, శ్రీరామ, శ్రీకృష్ణ, శివ, దేవీ మున్నగు సకల దేవతామూర్తులయందు మిక్కుటమగు భక్తితో మృదు మధుర గంభీరశైలిలో ఆయా దేవతలను స్తుతించారు. వారి భజ గోవింద శ్లోకములు ఒక మచ్చుతునక. శివానందలహరి సౌందర్య లహరి చిరస్మరణీయములు.

శ్రీ పోతనా మాత్యులు " సగుణంబెరిగి భజించిన అగు నిర్గుణ సిద్ధి సిద్ధుడగు నాతనికిన్ జగమెల్ల బ్రహ్మమయముగా తోచున్" అని పలికారు. సగుణోపాసన చేయగా చేయగా నిర్గుణ బ్రహ్మ సాక్షాత్కారము తప్పక సిద్ధించును.

నిర్గుణోపాసన గూర్చి ఛాందోగ్యము, బృహదారణ్యకము మున్నగు ఉపనిషత్తులలోను, ఉత్తర గీతలోను వర్ణింపబడియున్నది.

శిష్యుడు :- పూజ, జపము, ధ్యానము చేయుటకు కాల నియమముల గూర్చి తెలుసుకొన కోరెదను.



Scanned with CamScanner

మహర్షి :- పూజ, జపము, సుందర కాండ, భాగవద్గీతమున్నగు గ్రంథముల పారాయణకు ప్రాతఃకాలము చాలా మంచిది. మానసిక పూజ, ధ్యానమునకు సంధ్యా సమయములు చాలా అనుకూలముగా యుండును. ధ్యానమునకు మిక్కిలి ప్రశాంత సమయము బ్రహ్మీముహూర్తమే. ఆ కాలమందు ప్రకృతి చాల చక్కగా సహకరించును. నిశ్శబ్ద గాంభీర్య లక్షణములు మనసును అనాయాసముగా సమాహిత పరచును. "యజ్ఞానాంజపయ జ్ఞోస్మి" అన్నారు శ్రీకృష్ణ పరమాత్మ.



Scanned with CamScanner

# 4వ ప్రకరణము

శిష్యుడు :- మెండగు గురుభక్తితో మిక్కిలి శ్రద్ధా భక్తులతో గురూపదిష్ట మయిన మంత్రమును జపము చేయుగా ముఖ మందు మంచి తేజస్సు శాంతరసము ఉట్టిపడుచుండెను. అది చూచి ఆనందించి మహర్షి పుంగవులు యిట్లు చెప్పనారంభించిరి.

మహర్షి:- నేను చేసిన బోధ ఏమైనా అనుభవములోనికి వచ్చెనా?

శిష్యుడు:- చిత్తము స్వామీ, శ్రీరామ తారక మంత్రానుష్టాన సమయమున ఆనీల నీరద శ్యాముడు రామచంద్రుడు ఒక నిముసము కట్టెదుటకాన్పించి అంతలో అదృశ్యుడయ్యెను. అపుడు ప్రపంచ భావనలేదు. ఆనందమునకు అవధిలేదు. మనసునకు మంచి బలము వచ్చినది. తండ్రీ! ఆ అనుభవము నిరంతరమూ వుండాలని కోరుచున్నాను.

మహర్షి :- అభ్యాసము ముదిరిన కొలది అలాగే అవుతుంది. ఈ భగవత్సా క్షాత్కారానుభమము యొక్క రుచి, యీతీపి, ఒక్క మారు మనసునకు దొరికిన, యింక ఆ మనసునకు ప్రాపంచిక విషయములు, ఆసుఖములు వట్టి పేలవముగా కాన్పించును. అందువలన ఆ మనస్సు సహజముగా విషయముల వైపు పరుగిడదు. వైరాగ్యము సహజముగా అలవడును. మనసును బలవంతముగా ప్రయాస పూర్వకముగా మరల్ప వలసిన పనిలేదు. భగవంతుని యెడల నిష్కామ భక్తియందుగల సౌలభ్యమిదియే. భగవంతుని యెడల భక్తి ముదిరిన కొలది భాగవత లక్షణములు సహజాలంకారమై నిలుచును.

శిష్యుడు:- భగవంతుడు సచ్చిదానంద స్వరూపుడనెదరు. అందలి భావములు తెలిసికొన గోరెదను.

మహర్షి:- భగవంతుడు సచ్చిదానంద స్వరూపుడు. సత్, చిత్, ఆనందము అయిన స్వరూపము. సత్ అనగా ఉనికి. భగవంతుడు ఎల్లప్పుడూ ఉండువాడు. అనగా శాశ్వతుడు. ఒక ఇల్లు వున్నది, ఈభూమి ఉన్నది. అనునపుడు ఉన్నది. అనే ధర్మము సద్వస్తువైన శ్రీ రామచంద్ర పరబ్రహ్మమునకు చెందినదే 'చిత్' అనగా జ్ఞానము, తెలివి. ఆ పరమాత్మజ్ఞానస్వరూపుడు "సత్యంజ్ఞాన మనంతం బ్రహ్మ" అని శృతి వచనము పరమాత్మ ప్రజ్ఞానఘన స్వరూపుడు. ఆనంద స్వరూపుడు "ఆనందో బ్రహ్మేతివ్యజానాత్" శృతి. బ్రహ్మానందమును ఆనందమునకు పరమావధిగా జెప్పిరి. మానవుడు అనుభవించగల సమస్త ఆనందములు ఆ బ్రహ్మానందములో ఒక లవము ఒక లేశము మాత్రమే. విషయ సుఖములను వదలిపెట్టి, భక్తి, జ్ఞాన, వైరాగ్యములను అభ్యసించు భక్తులను, జ్ఞానులను చూచి వారిని రసానుభూతి, ఆనందమూ ఎరుగని శుష్కకాష్టములు, శూన్య హృదయులు అని లోకులు భ్రమించెదరు. వారి రసానుభూతికి ఆనందాను భూతికి అవధి లేదు "రసోవైసః" ఆ పరమాత్మరస స్వరూపుడు ఆనంద స్వరూపుడు. అట్టి పరమాత్మయందు సదారమించు యోగులు భక్తులు, జ్ఞానులు నిత్యనిరతి శయానందమును ఎప్పుడూ అనుభవించుచునే యుందురు. అసలు రాముడంటే అదే అర్థం "రమంతే యోగినోనంతే నిత్యానందే చిదాత్మని" ఇతిరామ పదేనాసౌ పరబ్రహ్మాభిధీయతే" యోగులు ఏ అనంత నిత్యానంద చిదాత్మయందు రమించెదరో ఆయన రాముడనబడుచున్నాడు. ఆయనే పరబ్రహ్మ.

శిష్యుడు :- అయితే స్వామీ! సగుణసాకార మూర్తియే నిర్గుణనిరాకార నిరంజన, నిర్వికార స్వరూపుడు అయి వెలుగుచున్నాడన్న మాట.



Scanned with CamScanner

మహార్షి :- భగవంతునకు అసాధ్యమైన దొకటి ఏమైనా వున్నదా! చూడు పోతనామాత్యుడు ఎలా వర్ణించాడో.

ఒకపరి జగములు వెలినిడి
యొకపరిలో పలికి గొనుచు నుభయముదానై
సకలార్థసాక్షియగున
య్యకలంకుని యాత్మమూలు నర్థిదలంతున్॥

మరియు

"భూతంబులైదునను బుట్టు చోటగువాని" "ఐదు భూతంబులయందమరువాని" అని పరమాత్మను వర్ణించారు. అయిదు భూతంబులు "పుట్టుచోటు" అనగా పరబ్రహ్మ కాదా? అన్నింట నన్ను చూచువాడు నాలో అన్నిటిని చూచువాడు నాకు అత్యంత ప్రియుడు, అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ. ఇట్లు సగుణ నిర్గుణములకు బేధము లేకుండా వర్ణించినారు అనుభవజ్ఞులు. అయితే ఉపాసకులకు సగుణ మందు సౌలభ్యమెక్కువ. అందుకే శ్రీకృష్ణపరమాత్మ గీతయందిట్లు పలికెను.

శ్లో. క్లేశోఽధికతరస్తే, షాం అవ్యక్తాసక్తచేతసాం
అవ్యక్తాహి గతిర్దుఃఖందేహవద్భిరవాప్యతే

చిత్తము అవ్యక్తమునందాసక్త మగుటచే వారికి మిక్కిలి క్లేశము కలుగును. కారణము ఏమనగా దేహధారణముగల వ్యక్తులగు వారికి ఆ వ్యక్తోపాసన కష్టముగనే సిద్ధమగుచున్నది. కాని ఎవరు నాయందు సర్వకర్మలు అర్పించి మత్పరాయణులై అనన్య యోగముతో నన్ను భజించుచున్నారో అట్టి అనన్య భక్తులను విలంబనము లేక యీ మృత్యు సంసారము నుండి ఉద్ధరించెదను.



Scanned with CamScanner

నిత్యకర్మానుష్ఠానము ఎపుడూ వదలకూడదు. నిష్కామ కర్మానుష్ఠానము ప్రతి మానవునికి విధి. దాని వలన చిత్తనైర్మల్యము సిద్ధించును. శుద్ధమువలె స్వచ్ఛముగా నుండు చిత్తమునందు భగవంతుడానందముగా అధివసించును. అంతేగాని సత్కర్మానుష్ఠానమును మధురమైన భక్తిని చేయక గొప్ప గొప్ప వేదాంత వాదములు చేయు వారు వుభయ మార్గములకు దూరులై శుష్క వేదాంతులుగా తయారై వారికి గాని సమాజమునకు గాని ఉపయోగము లేనివారేయగుదురు. అందుచే కర్మ, భక్తి వదలిన, నేల విడిచిన సామేయగును.

శిష్యుడు :- ఇంకనూ అనుభవ విషయములు వినవలెనని కుతూహలముతోయున్నాను.

మహర్షి :- మంచిది నీవంటి శ్రద్ధాసక్తులుగల శిష్యుని చూచి నాకు చంటి పిల్లవానిని చూచిన తల్లికి, లేగ దూడను చూచిన గోవుకి పాలు ఎట్లు చేపునకు వచ్చునో అట్లే నిన్ను చూడగానే బోధామృతము పొంగి పొంగి వచ్చుచున్నది. వినుము. ముద్రలలో షణ్ముఖిముద్ర చెప్పెదను. అభ్యాసము చేయుము.

అపుడు గురుదేవులు షణ్ముఖి ముద్రనుపదేసించిరి. కొద్ది రోజులయిన తర్వాత గురుదేవులు శిష్యుని చేరబిలిచియిట్లనిరి.

మహర్షి:- అబ్బాయీ! అనుభవమునకు ఏమైనా అందుచున్నదా?

శిష్యుడు :- ఓంకార నాదమువలె ఒక నాదము వినిపించుచున్నది. తళతళలాడే ఒక వెలుగు కనబడుచున్నది.

మహర్షి:- అది ఓంకారనాదము. ఆ జ్యోతి అపోజ్యోతి అందురు. ఇదియే చిత్కళ.



Scanned with CamScanner

ఆనాదమందు లీనమైతే ప్రశాంత, గాంభీర్య భావములు అలవడును. చిత్కళా దర్శనముచే ఆనందము చేకూరును. ఇట్టి చిత్కళ చూచునపుడు నీ దృష్టి భ్రూమధ్యమున నుండును. ఆ తరువాత జ్ఞానరూపమైన సువర్ణ సమకాంతితో అగ్ని మండలము కాన్పించును. ఇది ప్రత్యక్షమైన వెంటనే అనాది నుండి వచ్చుచూ అనేక జన్మల కారణమైన కర్మలన్నియూ అగ్నియందు వేసిన సమిధల వలె భస్మమగును.

శిష్యుడు :- తండ్రీ! ధన్యుడను. నా జన్మతరించినది. జనన మరణ రూపమయిన సంసార తాపము నశించినది. సూర్యతేజమువలె వెలుగు జ్ఞాన తేజస్సు గోచరించుచున్నది. అది చంద్రకాంతి వలె మనస్సును చల్లబరచినది.

మహర్షి:- అబ్బాయీ! నీవు అనేక జన్మలలో చేసిన పుణ్యకర్మ ఫలమే నా వద్దకు నిన్ను తీసికొని వచ్చినది. సద్గురుపాద సేవలభించుట కడు దుర్లభము. నేనిచ్చిన జ్ఞాన ధనమును నిత్యము అభ్యసించుచూ జాగ్రత్తగా కాపాడుకొనుము. సద్గురూపదిష్టమైన జ్ఞానము అనుభవములోనికి రావలెను. పాండిత్యము మంచిదే. వేదవేదాన్త విజ్ఞానము జగద్గురువులభాష్యముల ద్వారా అవగతము చేసుకొన వచ్చును. కాని అనుభవము ప్రధానము.

శ్లో॥ గ్రంధమభ్యస్య మేధావీజ్ఞాన విజ్ఞాన తత్పరః
పలాలమివ ధాన్యార్థీత్యజేత్ గ్రంధమశేషతః

శిష్యుడు సద్గురుమూర్తిని శ్రీరామ చంద్ర పరమాత్మను హృదయ కమలమందు నిలిపి సదా ధ్యాన నిష్ఠనభ్యసించి శాంత చిత్తుడై సద్గురుమూర్తికి సాష్టాంగ దండ ప్రణామము చేసి కూర్చునియుండెను.



Scanned with CamScanner

మహర్షి:- జ్ఞానతత్వమునే యెరుక అని కూడ అందురు. ఇదే చిక్కులు. ఈ కనబడే సమస్త ప్రపంచముజడము. ఈ ఎరుక వలన నీవు తెలుసుకుంటున్నావు గనుక ఆయెరుకే నీవు. నీవుజ్ఞాన స్వరూపుడవు. వివేకముచే అలాదృక్ - దృశ్యములను వేరు పరచి ఈ దృశ్యము యావత్తూ నీవు కావని దానిని తెలుసుకొనే తెలివే నీ స్వరూపమని గ్రహించవలెను.

శిష్యుడు :- ధన్యుడను స్వామీ ! ధన్యుడను, తమ వాగమృతధార వలన నాచిత్తము మిక్కిలి శాంతిని పొందినది.

మహర్షి:- ఈ తెలివికి మూలము తెలుసుకోవలెను. నేను నేనను వృత్తికి మూలమునకు పోవలెను.

జ్ఞాతృజ్ఞానజ్ఞేయ విహీనోయం సదాజ్ఞః అన్నారు. అహంవృత్తి రహితమైన కేవల పరబ్రహ్మస్వరూపుడగుదువు. ఇదియే కైవల్యము. స్వర్గమర్త్య పాతాళాది ఏ లోకానికి వెళ్లినా యీ వస్తువే నిండి నిబిడీ-కృతమై సర్వత్రా వ్యాపించియున్నది. అదే నీవు. అదే నేను. నేను నీవు ఒక్కటే. ఇంత కంటే వేరేమియు లేదు. ఇదియే సర్వవేదాంతసారము. స్వ స్వరూపమును తెలుసుకొనుట అనగా యిదే. స్వ స్వరూపజ్ఞానము కలిగిదాని యందు నిత్యమూ నిరతిశయ ఆనందము అనుభవించు అమనస్క యోగికి ఇంక చేయవలసిన కార్యములు ఏమియూ లేవు. మిగిలియుండవు. ఒక వేళ కర్మలు చేసినా అతనికి ఏమీ అంటవు. వేయించిన విత్తనములు మొలకెత్త లేవు. జ్ఞానులు లోకోపకారము కొరకు కర్మలయందు ప్రవర్తించినమా ప్రవర్తింతురు. ఏమైననూ అది ప్రారబ్ధాధీనమైయుండును.

శిష్యుడు :- ఈ కైవల్యనవనీతము యింకనూ ఆరగించ వలెనని యున్నది. తనివి తీరా



Scanned with CamScanner

యింకనూ బోధింపుడు స్వామీ! తమ సాన్నిధ్యములో కూర్చుని తమ బోధ వినుటయే అన్ని సాధనలను మించిన సాధనయని తలంచెదను.

మహర్షి:- అబ్బాయీ నిజమే చూడు శ్రీశంకర భగవత్పాదుల వారు ఏమన్నారో దక్షిణామూర్తి స్తవంలో

శ్లో॥ విశ్వందర్పణ దృశ్య మాన నగరీతుల్యం నిజాన్తర్గతం
పశ్యన్నాత్మని మా యయా బహిరివోద్భూతంయథానిద్రయా
యస్సాక్షాత్కురుతే ప్రబోధ సమయే స్వాత్మాన మేవాద్వయం
తస్మై శ్రీగురుమూర్తయే నమఇదం శ్రీ దక్షిణా మూర్తయే.

ఈ శ్లోకమున ముఖ్యముగా గమనించవలసినది యస్సాక్షాత్ కురుతే ప్రబోధసమయే అను వాక్యము యొక్క విశేషార్థము. ప్రబోధ సమయే అనగా సద్గురుని బోధచేయు సమయమందే విను సమయమందే అప్పటికప్పుడే. యత్ సాక్షాత్కురుతే, ఏది ప్రత్యక్ష అనుభవములోనికి వచ్చునో గురుని బోధ విను సమయ మందే బ్రహ్మాను భూతి కలుగుతుంది అని చెప్పబడింది. సందేహము లేదు. మరియు

శ్లో॥ సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం
నిశ్చలతత్వే జీవన్ముక్తిః

సత్సంగత్యము వలన మోక్షమే కరతలామలక మవుతుంది. సత్పురుషులనగా సత్ పదార్థమును అనగా దైవమును దర్శనము చేసుకొన్న మహా పురుషులు. అందుకనే



Scanned with CamScanner

వివేక చూడామణిలో

శ్లో॥ దుర్లభం త్రయమే తత్
మనుష్యత్వం, ముముక్షత్వం
మహా పురుష సంశ్రయః అని శంకరులన్నారు.

శ్రీమద్భగవద్గీతలో కూడ శ్రీకృష్ణ పరమాత్మ ఇట్లు బోధించారు.

శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన
పరిప్రశ్నే నసేవయా
ఉపదేక్ష్యంతి తేజ్ఞానం
జ్ఞానినః తత్వదర్శినః॥

శిష్యుడు :- సగుణసాకార మధురమూర్తియందు భక్తి చేయగా నిర్గుణ నిరాకార పరిపూర్ణ పరబ్రహ్మయందు లయించుననని అనుభవము !

మహర్షి :- అందుకే భక్త శిఖామణి యగు శ్రీ పోతన్న గారు

"సగుణంబెరిగి భజించిన అగునిర్గుణ సిద్ధి
సిద్ధుడగు నాతనికిన్ జగమెల్ల బ్రహ్మమయముగ తోచున్"

అన్నారు. పరాభక్తికి పరిపూర్ణజ్ఞానికి ఏమీ తేడా లేదు. నారదాదులు పరిపూర్ణజ్ఞానులయ్యు భక్తిని వదలలేదు. పరమాత్మను గురించి పాడుకొనుచూ లోకోపకారము చేసిరి. అద్వైత బోధ శిఖామణియగు శంకర భగవత్పాదుల వారు భజగోవిందము, శివానందలహరి, సౌందర్య లహరి, హరి మీడే స్తోత్రము లెన్నియో భక్తి



Scanned with CamScanner

భావ ప్రధానముగా వెలయించిరి.

శిష్యుడు :- తమ అనుగ్రహము వలన దురవగాహమైన వేదంత రహస్యములు కరతలామలకముగుచున్నవి.

మహర్షి :- సూత సంహితలోని యీ శ్లోకము వినుము.

శ్లో॥ యస్యానుభవ పర్యంతా
తత్త్వేబుద్ధి ప్రవర్తతే
ముచ్యంతే సర్వపాతకైః

ఆత్మసాక్షాత్కారార్థము యెవని మనసు పరతత్వమునందు లగ్నమై యుండునో అట్టి మహనీయుని కటాక్షముబడయు వారెల్లరును సమస్త పాపముల నుండి విముక్తులగుదురు. సద్గురు మూర్తి యందు ఎట్టి భావముండవలెనో శ్రీమద్భాగవత మిట్లు చెప్పుచున్నది.

శ్లో॥ ఆచార్యం మాంవిజానీయాన్నావ మన్యేత కర్హిచిత్
నమర్త్యభావేనపశ్యేత్, సర్వదేవమయోగురుః

ఒక్క క్షణము బ్రహ్మ విచారణయందు మనసు లీనమైతే ఎంత ఫలమున్నదో సూతసంహిత యిట్లు చెప్పుచున్నది.

శ్లో॥ స్నాతంతేన సమస్త తీర్థసలిలే దత్తావని సర్వశః
యజ్ఞానాంచ సహస్ర మిష్టమఖిలా దేవాశ్చ సంపూజితాః
సంసారస్య సముద్ధృతాః స్వపితరః త్రైలోక్య పూజ్యోప్యసౌ
యస్య బ్రహ్మ విచారణే క్షణమపి స్థైర్యం మనః ప్రాప్నుయాత్



Scanned with CamScanner

శ్లో. కులం పవిత్రం జననీ కృతార్థా
వసుంధరా పుణ్యవతీ చతేన
అపార సంవిత్సుఖ సాగరే స్మిన్
లీనంపరే బ్రహ్మణియస్యచేతః ॥

బ్రహ్మ విచారణ చే యెవని మనస్సు క్షణమైననూ లీనమగునో స్థైర్యమును బొందునో అట్టి మహనీయుడు సమస్త తీర్థములయందు స్నాన మొనర్చిన వాడును, సమస్త వసుంధరను దానమొనర్చిన వాడును, సహస్రయజ్ఞముల నాచరించిన వాడును సకల దేవతలను పూజించినవాడను. తన పితరులను సంసార బంధ విముక్తులను చేసిన వాడును, త్రిలోక పూజ్యుడును అయి వెలుగొందుచున్నాడు.

పర బ్రహ్మమనెడి యఖండ సచ్చిదానంద సాగరమున ఎవని మనస్సు లీనమగునో అట్టి పుణ్యపురుషుని మూలమున వాని వంశము పావనమై యొప్పును. జనని కృతార్థురాలగును. భూమి పుణ్యవతియై ప్రకాశించును.

శిష్యుడు:- అసలైన అమృత పానమంటే యిదే యని నేనను కొందును. ఇంత జ్ఞాన ధనము యిచ్చినందులకు తమకేమిచ్చి ఋణము తీర్చుకొనగలను.

మహర్షి:- ఏమిచ్చినా తీరదు. నిజమే. కాని నేనిచ్చిన బోధ బాగా మనసుకు పట్టించుకొని అభ్యసించి అనుభవము సంపాదించుట వలననే గురు ఋణము తీరగలదు.

శిష్యుడు:- మహాత్మా!, తమరు భక్తిని గురించి చెప్పునపుడు తన్మయత్వము చెంది అశ్రునయనములు, పులకాంకిత దేహము మున్నగు భాగవతలక్షణము లగుపడుచున్నవి. మీ యెదుట శ్రీరాముడున్నట్లే తోచుచున్నది. మరల నిర్గుణ, నిరంజన నిర్వికార



Scanned with CamScanner

పరబ్రహ్మమును బోధించు సమయమున సువిశాల సునీలాకాశమున రాజహంస సంచరించుచున్నట్లు గోచరించుచున్నది. ఆహా! ఏమి భోధ! ఏమి బోధ! ఏమి సమన్వయము!

మహర్షి :- మూలానికి చేరితే, అన్ని మార్గములు, అంతే కాదు అన్ని మతములు ఒకే పరమాత్మ పరబ్రహ్మ వస్తువును గురించే బోధించుచున్నట్లు స్పష్టముగా గోచరించును.

శిష్యుడు:- అచలమతమని కొందరు ఆచార వ్యవహారములనన్నింటిని వదలి అశరీరులమని పలుకుదురు. అచలమత మనగానేమి? మీరు బోధించెడి తత్వమునకు దానికి ఏ దైనా భేదమున్నదా ?

మహర్షి :- అచలమని పేరు అలా పెట్టుకున్నారే గాని మన బోధయందలి బ్రహ్మ వస్తువునే సులువుగా బోధపడుటకు తెలుగు భాషలో అలా వాడినారు. శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ కూడా పరబ్రహ్మ వస్తువును అచలమని వాడినారు.

శ్లో॥ అచ్ఛేద్యోఽయం అదాహ్యోఽయం అక్లేద్యోఽశోష్య ఏవచ
నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽయం సనాతనః (గీ ఆ 2 శ్లో.24)

ఆపరబ్రహ్మ ఛేదింపబడనిది, దహింపబడనిది, తడుపబడనిది, ఎండించుటకు వీలు లేనిది, నిత్యుడు, సర్వగతడు, స్థిరుడు సనాతనుడు మరియు "కూటస్థమ చలధ్రువమ్" అన్నారు.

ఆత్మ "సర్వ గతః" సర్వత్ర వ్యాపించినది. ఒక చోట వుండి వేరొక చోట లేనిచో ఒక చోటు నుండి మరియొక చోటునకు గమనము సిద్ధించును. సర్వత్రా నిండి



Scanned with CamScanner

నిబిడీ కృతమైన దానియందు చలన మెట్లు సంభవించును. కనుక అచలమన్నారు. చలించేది మనసు చలించనిది పరమాత్మ కనుక అచలమన్నారు.

శిష్యుడు :- ఇంకనూ ఒక సందేహము!

మహర్షి :- అడుగుము అబ్బాయీ అడుగుము. సంశయాత్మా వినశ్యతి అన్నారు. సర్వసందేహ నివృత్తి అయితే గాని వస్తువు బాగా పట్టదు.

శిష్యుడు :- వారు బయలు, బయలు అని ఒక మాట వాడు చుందురు. బయలనగా ఆకసమే గదా. ఆకసము పంచభూతములలో నొకటి గదా కనుక బయలనగా పరమాత్మ యెట్లగును?

మహర్షి :- శ్రీ వేమన యోగీంద్రులు పద్యాలలో "బయలు" అనే మాట తరచు వాడినారు. భాగవతుల కృష్ణ దాసుగారు పరబ్రహ్మము బయలని, నిర్బయలని వాడిరి. కాని పంచ భూతములలో నొకటగు , ఆకసము బ్రహ్మమెట్లగును? ఆత్మ స్వరూపము ఆకాశమువలె నిరాకారమైనప్పటికి, దానికి స్వయం ప్రకాశత్వము ఆనందము కలిగియున్నందున ఆకాశము బ్రహ్మమనుట సరిగాదు. రెండూ నిరాకారమైనవి స్వచ్ఛమైనవి, అవిచ్ఛిన్నమైనవి. అయితే ఒకటి చిదాకాశము, ప్రజ్ఞానఘనము రెండవది జడము. అజ్ఞానులు భ్రమ వలన, మాయావశులై ఆత్మస్వరూపమును ఆకాశముగా చూచెదరు. కాని జ్ఞానులు చిదాకాశమే ఆత్మ స్వరూపముగాను, అదే తమ స్వరూపముగాను గ్రహించెదరు. ఈ విషయము శ్రీ వసిష్ఠ భగవానుడు శ్రీరామ చంద్ర మూర్తికి సర్వ సందేహ నివృత్తి కొరకు ఎట్లు ఉపదేసించెనో చూడుడు.

శ్లో॥ సంవిదాకాశ రచన మిదం ఖాతి జగత్తయా
వస్తుతోన జగన్నాభావశూన్యం నచ సంవిదః

ఓ రామ చంద్రా చిదాకాశము యొక్క ఆభాసమే ఈ జగద్రూపమున స్ఫురించుచున్నది. వాస్తవమున జగత్తుగాని ఆభాసముగాని శూన్యముగాని ఎవ్వియులేవు.

శ్లో॥ యదిదంభాతి చిద్వ్యోమజగతాఖ్య తత్వతః
ఆకాశాదివ శూన్యత్వ దన్య దన్యదవ స్థితమ్

ఈ జగత్తనునది ఎయ్యేది భాసించుచున్నదో అది అజ్ఞానుల దృష్టియందు వేరుగ స్థితినొందియున్నప్పటికి శూన్యత్వము ఆకాశము కంటె వేరు కానట్లు ఈ చిదాకాశము కంటె వేరుగాకయేయున్నది.

శ్లో॥ దేశాద్దేశాన్తరం ప్రాప్తమధ్యే యత్సంవిదో వపుః
తద్దృశ్యమితి భాతీదం దృశ్యమన్యన్న విద్యతే

ఒక ప్రదేశము నుండి దూరమున నున్న మరియొక ప్రదేశమునకు నేత్రేంద్రియము ద్వారా బుద్ధి వృత్తిజనునపుడు ఆ రెండు ప్రదేశముల మధ్య నున్నది నిర్విషయమగు చైతన్య స్వరూపమెద్ది కలదో అదియే యీ దృశ్య రూపమున భాసించుచున్నది. అంతేగాని యీ దృశ్య మునునది వేరేమియు లేదు.

ఈ భావమునే పండితారాధ్యుల వారు తేటతెల్లముగా యిట్లు పలికిరి.



Scanned with CamScanner

కం. దేశమును విడిచి వేరొక
దేశమున కరుగు వేళదే దీప్యంబై
దేశాదేశము మధ్యా
కాశంబై చిన్మయంబుగనుపడుబసవా

ముఖ్యమైన ప్రజ్ఞానఘన చిదాకాశమే బయలనియు బట్ట బయలనియు లోబయలనియు నిర్బయలని, అచల మనియు, పరిపూర్ణమనియు అనుభవజ్ఞులు పలికిరి. శ్రీ శంకర భగవత్పాదులు శ్రీదక్షిణామూర్తిస్తవంలో "ఆకాశవత్ విభురుమేశనమో నమస్తే" అన్నారు. ఆకాశవత్ అన్నారు గాని ఆకాశమే అనలేదు కదా. దత్తాత్రేయుల వారు అవధూత గీతలయందు "జ్ఞానామృతం సమరసం గగనోపమోహమ్" అనగానేను జ్ఞానమనెడి అమృతస్వరూపుడను. సమభావమున నున్నవాడను. ఆకాశసామ్యముగలవాడను అని వారిస్థితి చక్కగా వర్ణించి చెప్పిరి.

శ్లో॥ నిర్మూల, మూలరహితోహిసదోదితోహమ్
నిర్ధూమదీపరహితోహి సదోదితోహమ్
జ్ఞానామృతం సమరసంగ గనోపమోహమ్

నేను సహజముగానే మూల కారణము లేని వాడనగుటచే సదా ప్రాదుర్భావము కలిగియున్నాను. ఆచ్ఛాదములేని వాడను. నన్ను ధూమము మరుగుపరచజాలదు. సదా ప్రాదుర్భవించియున్నాను. దీపాపేక్ష లేని వాడను. దీపకాంతి నన్ను ప్రకాసింప జేయలేదు. నేను జ్ఞానమనెడి అమృత స్వరూపుడను. సమభావమున నున్నవాడను. ఆకాశ సామ్యము కలవాడను.



Scanned with CamScanner

శ్లో॥ సంసార సంతతిలతానచమే కదాచిత్
సంతోష సంతతి సుఖేనచమేకదాచిత్
అజ్ఞాన బంధన మిదం నచమేకదాచిత్
జ్ఞానామృతం సమర సంగగనోపమోహం

తా॥ సంసార పరంపరయను తీగ నాకు చుట్టుకొనలేదు. సంతోష పరంపర నాకు సుఖమునీయదు. అజ్ఞాన మోహము నాకులేదు. నేను జ్ఞానామృత స్వరూపుడను. సమభావమున, గగన సామ్యముననున్నాను.

శ్లో॥ సంసార సంతతి కలంక నచమే వికారః
సంతాప సంతత తమో నచమే వికారః
సత్వం స్వధర్మ జనకం నచమే వికారః
జ్ఞానామృత సమరసం గగనోపమోహమ్

సంసార పరంపరా కలంకము నాకు లేదు. నాకు వికారము కలిగింపదు. దుఃఖ పరంపరా విషాదము నాకు లేదు. నాకు వికారము కలిగింపదు. స్వధర్మ నిర్వహణ సామర్థ్యము నాకు వికారము కలిగించుటలేదు. నేను జ్ఞానామృత స్వరూపుడను. గగన సామ్యమున సమభావముననున్నాను.

శ్లో. నశూన్య రూపం నవిశూన్య రూపం
నశుద్ధ రూపం నవిశుద్ధ రూపం
రూపం విరూపం నభవామి కించిత్
స్వరూప రూపం పరమార్థతత్వమ్.



Scanned with CamScanner

తా॥ నేను శూన్యముకాదు. శూన్యము కానిది కాదు. కల్మషమైనది కాను. కల్మషములేనిది కాను. చారురూపియు కాను, కురూపియు కాను. పరమార్థ తత్త్వము తనకు తానే సాటియైనది. ఈతత్త్వమునందు నిలుచుటయే మోక్షమనబడును. ఈ తత్త్వము తెలిసికొని అది తననిజస్వరూపమని తెలుసుకొని నిరంతరాభ్యాసముచే ఆరూఢ ప్రజ్ఞ సంపాదించవలెను. అట్టి ప్రాజ్ఞునకు యిక చేయవలసిన కర్తవ్యమేయుండదు.

శ్రీ కృష్ణ పరమాత్మ ఉత్తర గీతలో ఏలా వర్ణించారో చూడు.

శ్లో. ఊర్ధ్వ శూన్యమధ శ్శూన్యం మధ్యసూన్యం
యధాత్మకం సర్వశూన్యం తదాత్మేతి
సమాధి స్థస్య లక్షణం

శ్లో. సూన్యభావిత భావాత్మా పుణ్యపాపై ప్రముచ్యతే
అదృశ్య భావనానాస్తి, దృశ్యమే తద్వినశ్యతి
అవర్ణ మస్వరం బ్రహ్మ కధం ధ్యాయంతి యోగినః

ఇది శూన్యవాద మనుకుంటారేమో. కాదు. ఈ సమస్త దృశ్య ప్రపంచము బోధ సమయంలో అదృశ్యమైపోగా శేషించిన వస్తువు పూర్ణ పరబ్రహ్మ వస్తువు. ఈ పూర్ణ భావము బాగా మనసునకు పట్టుట కొరకై మరల మరల విశదీకరించితిని.

శ్లో. "ఊర్ధ్వ పూర్ణ మధః పూర్ణం మధ్య పూర్ణం" అని ఇది వరకే చెప్పినట్లు ఈ పూర్ణమే పరబ్రహ్మము. సత్పదార్థము. ఈ పరిపూర్ణపరబ్రహ్మ తత్త్వమును బోధించుటలో ప్రశ్నోత్తరములకు వాక్కు యొక్క సహాయము అనివార్యము. సర్వవేద వేదాంతసారము ఆపర బ్రహ్మ వస్తువే. నాలుగు వేదముల నుంచి నాలుగు మహా



Scanned with CamScanner

వాక్యములు తీసి సారవత్తరమయిన బ్రహ్మబోధ మనకందించారు మహాత్ములు. అవి (1) ప్రజ్ఞానంబ్రహ్మ (2) తత్త్వమసి (3) అహంబ్రహ్మాస్మి (4) అయమాత్మాబ్రహ్మ. ఈ సర్వ ప్రపంచమును తెలుసుకొను తెలివి జ్ఞానతత్త్వము. అదే బ్రహ్మము. ఆ బ్రహ్మము నేనే అని అనుసంధానము చేయవలెను. ఈ కనబడు సర్వ ప్రపంచమునకు అధిష్ఠానమైన చైతన్యము ఒక్కటి మాత్రమే. అదే పరబ్రహ్మము. ఆ పరబ్రహ్మ వస్తువువే రాముడు, కృష్ణుడు, సదాశివుడు. అన్ని నామములు ఆ వస్తువునకే వర్తించును. సహస్రనామములు ఆ పరబ్రహ్మ వస్తువునకే వర్తించును. అది ఒకప్పుడున్నది కాని మరియొకప్పుడు లేదని గాని, ఒక దేశమందున్నదనిగాని, మరియొక దేశమందు లేదని కానిమున్నగు వ్యవహారములు దానికి లేవు. దాని యందే సర్వప్రపంచము పుట్టుచున్నది. దాని యందే స్థితి కలిగియున్నది. దానియందే లయమును బొందుచున్నది. అట్టి సర్వ ప్రపంచమునకు మూలమయిన అచల పరిపూర్ణ పరబ్రహ్మ వస్తువు ఎక్కడో ఉన్నదని భ్రాంతి పడకుము. అట్టి అమృత వస్తువు నీలోనేయున్నది. అదే నీవు. అదే నేను. నీవే నేను. నేనే నీవు. ఇంక పైన మాట్లాడుటకేమున్నది. అన్ని మాటలు యిక్కడ దాకా వచ్చి ఆగిపోవును. అందుకనే "యతోవాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ" అని శృతి వచనము. శ్రీదక్షిణా మూర్తి స్వరూపమును వర్ణించుచూ "మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వం" అనియూ

శ్లో. చిత్రంవట తరోర్మూలే వృద్ధాశ్శిష్యా: గురు ర్యువా
గురోస్తు మౌనం వ్యాఖ్యానం! శిష్యాస్తుఛిన్న సంశయః ॥

ఆ వటవృక్షము క్రింద ఉన్న చిత్రము చూడుము. శిష్యులు వృద్ధులు. జనన మరణ ప్రవాహమున మునిగి ఈదులాడుచున్న వృద్ధులు. లేక అనేక సంవత్సరములు



Scanned with CamScanner

చేసిన తపస్సు చే వృద్ధులైనవారు. మరి గురువో! నిత్యయౌవన వంతుడై అఖండై కరు స్థితిలో వెలుగొందు దక్షిణా మూర్తి స్వామి.

ఇంకా చిత్రమేమనగా పరబ్రహ్మతత్వమును గురించి వారు జ్ఞానముద్ర ధరించి మౌనము చేతనే వ్యాఖ్యానము చేయుచున్నారు. అందువలన శిష్యులకు సర్వసందేహాని వృత్తి కలిగినది. బ్రహ్మనిష్ఠితులైనారు. కనుక సర్వధా అద్వైత సిద్ధాంతే "మౌనం పర్యవసానతా" అన్నారు. ఈ స్థితికే ముక్తియనియు మోక్షమనియు అందరు దీనినే బ్రహ్మీ స్థితియని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతయందు వర్ణించినారు. ముక్తి యెక్కడో సూదూరంలో, పర్వత గుహలలోనో అరణ్యములలోనో స్వర్గలోకంలోనో దేహాంత మందో ఉన్నదని భ్రాంతి పడకు అది నీ హృదయ గుహాయందేయున్నది.



Scanned with CamScanner

# 5వ - ప్రకరణము

మహర్షి ముఖ పద్మము ఉదయ భానుని బంగారు కాంతులచే వికసించిన తామర పద్మము వలె ఆకర్షణీయముగా కనబడుచుండెను. ప్రశాంత గాంభీర్య లక్షణములు అచ్చోట అలుముకొనియుండెను. సద్గురు మూర్తి చేత తులసిమాల ధరియించి జపయజ్ఞ దీక్షలో ఉన్నారు.

శిష్యుడు దైనందిన నిత్యకర్మానుష్ఠానము పూర్తి చేసుకొని శ్రీ గురుదేవులను సమీపించి సాష్టాంగ వందన మాచరించి సావధానచిత్తుడై కూర్చునియుండెను. కొంత సేపైన తరువాత శిష్యుడు మహర్షి పుంగవులను యిట్లు ప్రశ్నించెను.

శిష్యుడు :- స్వామీ పూర్ణ ప్రజ్ఞాదురంధురులైన తమకు కూడా యింకా జపతపములతో పనియున్నదా? అని సందేహము కలుగుచున్నది. అది ఉచితమయితే సమాధానమును అనుగ్రహించ గోరుచున్నాను.

మహర్షి :- నీకు కలిగిన సందేహము మునుపు పరీక్షిన్నరేంద్రునకూ కలిగినది. ఆయన శుకమహర్షిని యీలాగే ప్రశ్నించాడు.

శ్రీమన్నారాయణ మూర్తిని అనవరతము నిష్కామ భక్తిచే భజించి, జ్ఞానముచే పండి తరించిన సనకసనందన, వ్యాస, వాల్మీకి పరాశర నారదాది మహనీయులు నిత్యము శ్రీహరిని కీర్తించుచూ కాలము గడుపుచుందురు. వారు ఏ కోర్కెలు లేని నిర్మల చిత్తులు గదా! వారికిక ఏ సాధనతోను పనిలేదు గదా. అయినను వారెపుడూ భక్తినిష్ఠ మానలేదు. వారు విధి నిషేధ రహిత విమలమతులు. హరినామము అంత తీపైనది అన్నారు.



Scanned with CamScanner

అందువలన నారదాదులు హరినామ కీర్తనము వదలలేదు. యజ్ఞయాగాదులు వారు చేయుచూ యితరులచే చేయించుచుండిరి. జనకుడు, అశ్వపతి ఇక్ష్వాకువు మున్నగురాజ ఋషులు రాజ్యపాలనాది కర్తవ్యము మానలేదు. వారు విధి నిషేధములకు అతీతులు. అయినా వారెన్నడూ నిషిద్ధ కర్మలు చేయలేదు. అనేక సత్కర్మలా చరించి, సద్గుణ పుంజములనేకము అభ్యసించి, గురుశుశ్రూషాది శిక్షణ బాగా పొంది భక్తి, జ్ఞానవైరాగ్యములచే బాగా పండిన మహనీయులు, ఉదారచరితులు. తప్పు పని యేమి చేయగలరు? నిష్ణాతుడైన నర్తకునికి ఒక్క తప్పటడుగు పడదన్నారు, శ్రీ రామకృష్ణ పరమహంస వారి జీవితమే ఒక ఒరవడి "యద్యదాచరతి శ్రేష్ఠఃతత్తదేవయితరోజనాః" అని భావద్గీతనుడి. వారి ప్రవర్తన ద్వారా బోధల ద్వారా లోకము తరించగలదు. "ఉదార చరితానాంతువసుధైన కుటుంబకమ్". వారి హృదయములు విశ్వవిశాలములు. సర్వులయెడల సమభావముతో ప్రవర్తింతురు. వారికి లోకానికి మేలు చేయాలనే ఉదారాశయము తప్ప మరియే యితర కోర్కెయుండదు.

"లోకాస్సమస్తాస్సుఖినోభవంతు" అనేదే వారినిత్య తపస్సు.

నాయనా ! నీవు కూడా నీ విద్యుక్త కర్మ మానకుము. నిత్యము స్నానము, సంధ్యావందనము, యిష్టదేవతార్చన , అతిధి మర్యాదులు మున్నగు సత్కర్మలన్నీ యధావిదిగా ఆచరించుము. మనము గృహస్థాశ్రమంలో ఉన్నాము. ఈ ఆశ్రమానికి సంబంధించిన శాస్త్రోక్త సమస్త కర్మలు చెయ్యాలి. చేయక అలసత్వంచే మానుట తప్పేయగును. మనలను చూచి యితరులు ప్రభావితులౌతారు. అలా అవాలనే అహం మనకి వుండకూడదు. మన ప్రవర్తన మనకి సహజ అలంకారము మాత్రమే.



Scanned with CamScanner

శ్లో॥ వివేకీ సర్వదాముక్తః కృతోనాస్తీతికర్తృతా
అలేపవాదమాశ్రిత్య శ్రీకృష్ణజనకౌయధా॥

సదసద్వివేకము కలిగి బ్రహ్మ నిష్టయందు అరూఢ ప్రజ్ఞ కలిగిన మహనీయులు శ్రీకృష్ణుడు, జనక చక్రవర్తి వలె కర్మలు చేసిననూ వారికి కర్మలేపమేమాత్రము అంటదు.

శ్లో॥ జ్ఞస్యనార్థః కర్మ త్యాగైః నార్థకర్మ సమాశ్రయైః
తేనస్థితంయధాయద్య తత్తధైవకరోత్యసౌ॥

శ్లో॥ మమనాస్తి కృతేనార్థో నాకృతేనేహకశ్చన
యధా ప్రాప్తేనతిష్ఠామి హ్యకర్మణికఆగ్రహః॥

జ్ఞానికి కర్మను వదలిపెట్టుట చేత గాని, చేయుట చేగాని ప్రయోజన మేమియులేదు. కాన అతడు ప్రయత్నించి ఏ పనీ చేయడు. సంభవించిన దానిని, సంభవించినట్లాచరించును. కర్మలు చేయనని అకర్మయందు పట్టుదలయెందుకు? కాన శాస్త్రముల వలన ప్రాప్తములయిన కర్మలనన్నింటిని చేతును.

శ్రీకృష్ణపరమాత్మ అర్జునకు చేసిన గీతాబోధలో కూడ జ్ఞానియైనను కర్మలను వదలనక్కర లేదనియు చేయుటచే లోకోపకారమగుననియు చెప్పిరి. సహజ బంధస్వభావము కలకర్మలను నిష్కామముగా జేసిన చిత్తశుద్ధి లభించి తద్వారాజ్ఞానము, జ్ఞానముచే మోక్షము కలుగునని చెప్పిరి. అందువలన కర్మలన్నీ జ్ఞానయోగముగా మారును మరియు



Scanned with CamScanner

శ్లో॥ నబుద్ధి భేదం జనయేదజ్ఞానాం కర్మసంగినామ్
జోషయేత్ సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్ (గీత.3-26)

యుక్తః అనగా యోగయుక్తః అని సమన్వయం. జ్ఞానియగు వాడు కర్మఫలాసక్తులైన అజ్ఞానుల యొక్క బుద్ధికి సంశయమును కలిగింపరాదు. తాను యోగయుక్తుడై నేర్పుతో సమస్త కర్మలను ఆచరించుచూ తనయాచరణ చూచి వారు కూడ సంశయము వీడి ఆ ప్రకారము అనుష్టించునట్లు చేయవలెను. తనకు అవసరము లేదు కదా అని కర్మలు వీడక అజ్ఞులకు ఆదర్శప్రాయుడై కర్మలు చేయవలెను.

శ్లో॥ సక్తాః కర్మణ్య విద్వాంసోయథా కుర్వంతి భారత!
కుర్యాద్విద్వాంస్తదా ఽ సక్తశ్చి కీర్షుర్లోకసంగ్రహమ్ (గీత 3-25)

ఓ అర్జునా! అజ్ఞానులు కర్మయందు తగులుకొని ఫలాపేక్షతో ఏ ప్రకారము చేయుచున్నారో ఆ ప్రకారమే జ్ఞానులు వాటియందు తగులు కొనక ఫలాసక్తిరహితులై లోక కళ్యాణము నిమిత్తము కర్మల నాచరించవలెను.

శ్లో॥ యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదే వేతరో జనః
సయత్ప్రమణాంకురుతే లోకస్తదనువర్తతే

గొప్ప వారేకర్మలను చేయునో దానినే తక్కిన వారు కూడ చేయుదురు. వారు దేనిని ప్రమాణముగా తీసుకొందురో తక్కిన వారును దానినే యనుసరింతురు.

శ్లో॥ కర్మణైవ హిసంసిద్ధి మాస్థితా జనకాదయః
లోక సంగ్రహమే వాపి సంపశ్యన్ కర్తుమర్హసి॥ (గీత 3-20)



Scanned with CamScanner

జనకుడు మున్నగు వారు నిష్కామ కర్మానుష్ఠానము వలననే మోక్షమును బొందిరి. జనులను సన్మార్గమందు ప్రవర్తింపజేయు ఉద్దేశ్యముతో నైనను నీవు కర్మలు చేయువలెను.

జనకాదయః అనుటవలన జనకుడు, అశ్వపతి, ఇక్ష్వాకువు ప్రహ్లాదుడు, అంబరీషుడు మున్నగు చక్రవర్తులంతా అనేక సత్కర్మలాచరించి, చిత్త శుద్ధిబడసి అట్టి నిర్మల చిత్తమున జ్ఞాన భాస్కరుడుదయింప ఆరూఢ ప్రజ్ఞ కల వారైలోకోపకారము కొరకు యావజ్జీవము యజ్ఞ యాగాది సత్కర్మలే కాక రాజ్యపాలనాది లోకవ్యవహారము చేసిరి.

ఉపన్యాసములిచ్చుట కంటె ఆచరణ వలన యితరులకు ఎక్కువ మేలు కలుగును. ఇట్టి జ్ఞానినే స్థిత ప్రజ్ఞుడని చెప్పి అతడు ఎట్లు ప్రవర్తించునో భగవద్గీతలో జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మ చక్కగా వర్ణించినారు.

శ్లో. ప్రజహాతియథాకామాన్సర్వా న్పార్థమనోగతాన్
ఆత్మన్యేవాత్మ నాతుష్టః స్థిత ప్రజ్ఞస్త దోచ్యతే

అర్జునా! ఎపుడు మనుజుడు తన మనసునందున్న కోరికలన్నింటిని వదలి వేయునో మరియు ఆత్మయందే నిరంతము సంతుష్టిని బొందు చున్నాడో అతడు స్థితప్రజ్ఞుడు అని చెప్పబడును.

శ్లో. దుఃఖేష్వను ద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః
వీతరాగభయక్రోధః స్థిత ధీర్మునిరుచ్యతే



Scanned with CamScanner

దుఃఖము నందు కలత నొందక సుఖమునందు పుబ్బి పోక అనురాగము, భయము, కోపము తొలగిన వాడును అనగా ఆత్మయందే మనసు నిలిపినవాడు స్థితప్రజ్ఞుడని చెప్పబడును.

శ్లో॥ యస్సర్వత్రానభి స్నేహః తత్తత్ప్రాప్య శుభాశుభమ్
నాభినన్దతి నద్వేష్టి తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా

ఎవడు సమస్త విషయముల యందు అనగా దేహసంబంధమైన భోగాదులయందు అభిమానము లేకయుండునో ప్రియమైనవి గాని అప్రియమైనవి గాని వచ్చినపుడు సంతోషముగాని, ద్వేషముగాని బొందకుండునో అట్టివాని జ్ఞానము స్థిరమైనది. అట్టి వాడే స్థితప్రజ్ఞుడు.

శ్లో॥ రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి

స్వాధీనమైన మనస్సు గలవాడు, రాగద్వే షరహితములును తనకు అధీనములైయున్నవియునగు ఇంద్రియములచే అన్న పానాది విషయములను అనుభవించుచున్ననూ, మన శ్శాంతి బొందుచున్నాడు. నీటిలో నున్న పద్మ పత్రము నీటినంటునట్లు ఇట్టి జ్ఞానులు కర్మ చేసిననూ చేయని వారే. అవి వారిని ఏమీ అంటవు. వారు చేయు కర్మలన్నీ సమాజమునకు మేలు చేయుటకే.

యోగవాసిష్టము నందు వసిష్ట భగవానుడు శ్రీరామచంద్రునకు బ్రహ్మజ్ఞానమునంతనూ లెస్సగా భోధించి అట్టి జ్ఞానియగువాడు లోకములో ఎట్లు ప్రవర్తించునో చాలా చక్కగా విపులముగా బోధించిరి. యోగవాసిష్టము చాలా వుత్తమమైన

వేదాంత గ్రంథము. వశిష్ట భగవానుని ఉపదేశము అరటిపండు ఒలిచి చేతులలో పెట్టి నట్లేయుండును. జ్ఞానులు ఈ లోకములో యేలాగ ప్రవర్తింతురో చాలా విపులముగా బోధించిరి చూడుము.

శ్లో॥ సర్వప్రకృత కార్యస్థోమధ్యస్థః సర్వదృష్టిషు
ధ్యేయంతం వాసనా త్యాగమవలంబ్య వ్యవస్థితః

తా॥ ప్రాప్తించిన కార్యములన్నిటిని జేయుచు శత్రు మిత్రాదులయందు సమ దృష్టి కలిగి వాసనాత్యాగులై జీవన్ముక్తులై మహాత్ములు ఈ ప్రపంచమున విహరింతురు.

శ్లో॥ సర్వత్ర విగతోద్వేగః సర్వార్థ పరిపోషకః
వివేకోద్యోత దృష్టాత్మా ప్రబోధో పవనస్థితః

శ్లో॥ సర్వాతీత పదాలమ్బా పూర్ణేందు శిశిరాశయః
నోద్వేగీన చతుష్టాత్మా సంసారే నావసీదతి

తా॥ ఉద్వేగ రహితుడును, సర్వజన హితకరుండును, వివేకముచే ప్రకాశించు అంతః కరణము కలవాడును, జ్ఞానమను ఉప వనమున నుండు వాడను, సర్వాతీతతమగు బ్రహ్మాపదమునాశ్రయించిన వాడును పూర్ణ చంద్రుని వలె శీతలాంతఃకరణము కలవాడును, మిగుల దిగులుగాని సంతుష్టిగాని చెందని వాడును అగు మహనీయుడు ఈ ప్రపంచమున దుఃఖమునొందడు.

శ్లో. సర్వశత్రుషు మధ్యస్థో దయాదాక్షిణ్య సంయుతః
ప్రాప్త కర్మ కరో స్పృహాణాంసంసారే నవసీదతి



Scanned with CamScanner

తా॥ శత్రు మధ్యమందైనను చలించని మనస్సు గలవాడును దయా దాక్షిణ్యాది సద్గుణ సంయుతుడును, సమయోచితకార్యముల నెరవేరుచువాడును అగు పుణ్యాత్ముడీ లోకమున దుఃఖము నొందదు.

శ్లో॥ పూర్ణాందృష్టి మవష్టభ్య ధ్యేయ త్యాగవిలాసినీం
జీవ న్ముక్తతయాస్వస్థోలోకే విహర రాఘవ

తా॥ యుక్తమగు పూర్ణదృష్టినవలంబించి జీవన్ముక్తి నాశ్రయించి, స్వస్థ చిత్తుడవై లోకమున విహరింపుము.

శ్లో॥ అన్తః సంత్యక్త సర్వాశో వీతరాగో వివాసనః
బహిః సర్వసమాచారోలోకే విహరరాఘవ

తా॥ ఓ రాఘవా! అంతరంగమున సమస్త ఆశలు వీడి, వీతరాగుడును వాసనారహితుడవై బహ్యామున వర్ణా శ్రమాచారములను నెరపుచూ లోకమున విహరింపుము.

శ్లో॥ ఉదారపేశలా చారః సర్వాచారాను వృత్తిమాన్
అన్తః సర్వపరిత్యాగీ లోకేవిహార రాఘవ

తా॥ ఓ రాఘవా ఉత్తమాచారసమన్వితుడవై బాహ్యామున సర్వాచారములను నెరవేర్చుచూ, అంతరంగమున సర్వమును పరిత్యజించి లోకమున విహరింపుము.

శ్లో॥ ప్రవిచార్య దశాః స్సర్వాయదదుచ్చం పరంపదమ్
తదేన భావేనావలంబ్య లోకే విహర రాఘవ



Scanned with CamScanner

తా॥ ఓ రామా సాంసారిక, పారమార్థిక దశలన్నీ చక్కగా విచారించి, మహత్తరమగు బ్రహ్మ పదమునే భావనచే ఆశ్రయించి లోకమున విహరింపుము.

శ్లో॥ అంతర్వైరాశ్య మాదాయ బహిరాశోన్ముఖేహిత:
బహిస్తప్తో అంతరాశీతో లోకే విహర రాఘవ

తా॥ ఓ రాఘవా అంతరంగమున ఆశావర్జితుడవై బాహ్యమున ఆశాయుక్తుని వలె క్రియలను గావించుచూ ధనాదులు నశించినపుడు పరితాపమును బొందినట్లు బాహ్యమున కనపడినను అంతఃకరణమున ప్రశాంత స్థితి యందే యుండుచు లోకమున విహరింపుము.

శ్లో॥ బహి: కృత్రిమ సంరంభో హృదిసంరంభ వర్జిత:
కర్తా బహిర కర్తాన్తర్లోకే విహర రాఘవ

తా॥ ఓ రాఘవా బాహ్యమున క్రోధ సంయుతుడవును అంతర్యమున క్రోధ విర్జితడవునై సర్వకార్యములు చేయుచున్నమా అంతరంగమున అకర్తవైయుండి లోకమున విహరింపుము.

శ్లో॥ ఆశాపాశ శతోన్ముక్త: సమ: సర్వాసు వృత్తిషు
బహి: ప్రకృతి కార్యస్థో లోకే విహర రాఘవ

తా॥ పలు విధములగు ఆశాపాశముల నుండి విముక్తుడవై సర్వ వృత్తులయందు సమరూపుడవై బాహ్యమున వర్ణాశ్రమాచార స్వభావయోగ్యమగు లేక ప్రజో పహిత కార్యములను చేయుచూ లోకమున విహరింపుము.



Scanned with CamScanner

శిష్యుడు :- ఆహా! ఏమి బోధ! ఏమి శాస్త్రము! స్వామీ తమ బోధల వలన మోడులైననూ చిగర్చ వలసినదే. బండరాళ్లైనను కరగవలసినదే. తమరు బ్రహ్మ విద్య బోధించుట కొరకు అవతరించిన దక్షిణామూర్తియే! గురుదేవా! తమసేవా భాగ్యము వలన నా జన్మ ధన్యమైనది.

శ్లో. ధన్యోహంధన్యోహం తృప్తేర్మే కోపమా భవేల్లోకే
ధన్యోహం ధన్యోహం ధన్యో ధన్యపునపునర్ధన్య:

తా॥ నా తృప్తికి సాదృశమైనదీలోకములో ఏదీ లేదు. నేను చాలా చాలా ధన్యుడను. బ్రహ్మానందమున కలుగు తృప్తి మరియే యితర వస్తుసంచయము వలననూ కలుగదు.

శ్లో. అహోపుణ్యమహోపుణ్యం ఫలితం ఫలితం దృఢం
అస్య పుణ్యాస్య సంపత్తే రహోవయ మహోవయమ్

తా॥ అహో ఎంత ఆశ్చర్యము! దృఢముగా ఫలించిననా పుణ్యము వలన కలిగిన సంపత్తి వలనమేము ఎంత వారమయితిమి.

శ్లో. అహోశాస్త్ర మహో శాస్త్ర, మహో గురు రహో గురు:
అహో జ్ఞానమహోజ్ఞాన సుహోసుఖమ హోసుఖమ్

తా॥ శాస్త్రము ఎంత విచిత్రమైనది. సద్గురువులు ఎంత మహనీయులు. జ్ఞానము ఎంత గొప్పది. మోక్ష సుఖము ఎంత గొప్పది.

ఓం శాంతి: శాంతి: శాంతి:



Scanned with CamScanner

ఓం సహనావతు! సహనౌ భునక్తు! సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై

ఓం పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణముదుచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణ మేవావ శిష్యతే॥

ఓం శాంతిః శాంతిః శాంతిః
ఓం తత్ సత్



Scanned with CamScanner

# మా వద్ద లభించు ఆధ్యాత్మిక గ్రంథములు

అస్మత్ మంత్ర దీక్షా గురువర్యులు శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షుల అంతరంగిక శిష్యులైన శ్రీలింగాల సూర్యనారాయణ గారు రచించిన గ్రంథములు భక్తి జ్ఞాన, వైరాగ్య ప్రబోధకములై, ముముక్షువులకు సాధన సంపత్తికరములై ఒప్పారుచున్నవి.

శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షి ప్రియ శిష్యులైన శ్రీ లింగాల సూర్యనారాయణ గారు రచించిన (1) శ్రీ విశ్వనాథావధూత స్వామి పూజా విధానము (2) శ్రీ సుబ్రహ్మణ్య సద్గురు పూజా విధానము (3) శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి సుప్రభాతమ్ (4) శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి బోధామృతము – నిర్గుణోపాసన మున్నగు గ్రంథములు మా వద్ద ఈ దిగువ చిరునామాలలో లభించగలవు.

ఇంకను ఎన్నో ఆధ్యాత్మిక కీర్తనలు ముద్రణకుయున్నవి. అందులకు తగిన ప్రయత్నములు చేయుచున్నాము. అందులకుగాను ప్రింటు చేయించిన పుస్తకములు కావలసిన వారు ఈ క్రింది చిరునామాలకు వ్రాయగోరెదము.

Scanned with CamScanner

## పుస్తకములు లభించు చిరునామాలు

(1) శ్రీ రెడ్డి సత్యనారాయణ మూర్తి
C/o. శ్రీరామ క్షేత్రమ్
మహేంద్రవాడ. Via అనపర్తి
తూ. గో. జిల్లా

(2) G. Bhaskara Murthy
5/3RT, Panjagutta
Housing Board Colony,
Lakshmi Nivas, Ist Floor,
Panjagutta, Hyderabad- 82.

(3) Sri M.V. Subrahmanyam
H.No.23-22-72,
Hanuman Street,
Satyanarayanapuram,
Vijayawada - 11.

(4) Sri K.S.Paramahamsa
Dy. Manager, Finance
Simhadri Project,
NTPC, VIZAG.

Note : The price of the books is primarily devotion and enrichment of human life. People interested in the development of spiritual activity can come forward to donate and thereby help to enable us to print more and more books. Photos as mentioned earlier can be obtained on prior request. People who seek the truth can visit Sri Rama Kshetram, Mahendrawada, E.G. District, near Rayavaram where Sri Sri Sri Subrahmanya Maharshi did penance. The true seekers can obtain the peace, blessings, and divine bliss. Sri Subrahmanya Maharshi's Rajayogasrama is now run by Sri Reddi Satyanarayana Murthy who is celebrating Nitya Pooja and Worship to the idols of Sri Subrahmanya Maharshi Dampatulu as per Sanatana Dharma along with Sri Sita Ramachandra Prabhu and Sri Raja Rajeswari as presiding Divinity culminating into BRAHMA VIDYA.

Scanned with CamScanner